ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

మంగళవారం 29 ఏప్రిల్ 2025 | 5



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 40.0 (సోమవారం)

కనిష్ఠం : 25.0



నిద్ర సుఖమెరుగదు.. పాపం పెద్దావిడకు ట్రాఫిక్ బూత్ నీడనిచ్చింది.. ఇలా సేదతీరుతోంది.



పుష్కరఘాట్ వద్ద వంతెన కింద ఎండ మండుతున్న ఇలా..

గూడు లేదు.. నీడా లేదు!

గూడూ నీడా లేని బతుకులు వారివి.. ఎండకు ఎండాలి.. వానకు తడవాలి.. ఎండ మండిపోతున్నా ఎక్కడ నీడ కనిపిస్తే అక్కడ సేద తీరాలి.. పూర్వం ఇటువంటి వారు తలదాచుకో వడానికి సత్రాలు ఉండేవి.. ఆ సత్రాల నీడన ఉండే వారు.. స్పీడ్ యుగంలో అటువంటివన్నీ కనుమరుగైపో యాయి.. అందుకే రోజుల తరబడి పుష్కరఘాట్, గోదావరి గట్టు రోడ్డు పక్కనే వంతెనల కింద తలదాచు కుంటున్నారు.. అయ్యా అధికారులు ఒకసారిపై వీరిపై దృష్టి పెట్టండి...నగరంలో కాస్త నీడచూపండి. - ఫొటోగ్రాఫర్,రాజమహేంద్రవరం



విజయోత్సాహం : తుని మునిసిపల్ కౌన్సిల్ సభ్యులతో ఎమ్మెల్యే యనమల దివ్య .. చైర్‌పర్సన్ నార్ల భువన సుందరిని చైర్మన్ పీఠంపై కూర్చోబెడుతున్న ఎమ్మెల్యే

మద్దతుని.. కూడగట్టుకుని..

తుని చైర్మన్ పీఠం టీడీపీ కైవసం

- ప్రశాంతంగా మునిసిపల్ ఎన్నిక
- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఏకగ్రీవం
- చైర్‌పర్సన్‌గా భువన సుందరి
- వైస్ చైర్మన్‌గా ఆచంట సురేష్
- పట్టణంలో సెక్షన్ 144 అమలు

తునిరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ మద్దతుని సంపాదించింది. చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. కాకినాడ జిల్లా తుని మునిసిపాలిటీలో చైర్‌పర్సన్ పీఠంతో పాటు వైస్ చైర్మన్‌ను టీడీపీ దక్కించుకుంది. టీడీపీ మద్దతు ప్రకటించిన చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, వైస్‌చైర్మన్ ఆచంట సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తుని మునిసిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిల్ ఉండగా, వీరంతా వైసీపీ నుంచే గెలిచారు. వీరిలో ఒకరు మృతి చెందగా, మరొకరు రాజీనామా చేశారు. దీంతో 28 మంది కౌన్సిల్ సభ్యులు ఉండగా 15మంది కౌన్సిలర్లు టీడీపీలోకి చేరడంతో వైసీపీ బలం సన్నగిల్లింది.ఈ నేపథ్యంలో ఎన్నిక లాంఛనమైంది. ఎన్నికల పరిశీలకులు, కాకినాడ జేసీ రాహుల్‌మీనా, ఎన్నికల అధికారి, డీపీవో రవి కుమార్ సోమవారం ఉదయం 11 గంటలకు మునిసిపల్ కౌన్సిల్ హాల్లో ఎన్నిక నిర్వహించారు. 26వ వార్డు కౌన్సిలర్ల కొచ్చెర్లపాటి రూపాదేవి 18వ వార్డు కౌన్సిలర్ నార్ల భువన సుందరిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా 24వ వార్డు కౌన్సిలర్ పులి సత్యనారాయణ మద్దతు తెలిపారు. దీంతో మునిసిపల్ చైర్‌పర్సన్‌గా నార్ల భువనసుందరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. వైస్‌చైర్మన్‌గా 19వ వార్డు కౌన్సిలర్ ఆచంట సురేష్‌ను 28వ వార్డు కౌన్సిలర్ చింతకాయల భారతి ప్రతిపాదించగా 9వ వార్డు కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీనివాస్ మద్దతు తెలపగా, వైస్‌చైర్మన్‌గా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మునిసిపల్ ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య హాజరై చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను అభినందించారు. తర్వాత ఎన్నికల అధికారి రవికుమార్ నియామకపత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ముహూర్త సమయానికి ఎమ్మెల్యే దివ్య చైర్‌పర్సన్ భువన సుందరిని మునిసిపల్ పీఠంపై కూర్చోబెట్టి అభినందించారు. ఎన్నికల నేపథ్యంలో మునిసిపల్ కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలుచేశారు. అలాగే డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐలు గీతారామకృష్ణ, చెన్నకేశవరావు ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించారు.




వైస్‌చైర్మన్ ఆచంట సురేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే దివ్య

తుని నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం. పట్టణాభివృద్ధికి కంకణబద్ధులై తనతో అడుగులు వేసేందుకు 15 మంది కౌన్సిలర్లు స్వచ్ఛందంగా టీడీపీలో చేరారు. వారందరి సహకారంతో పట్టణాన్ని స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తా..

పదవి బాధ్యతగా భావించి పనిచేస్తా..



తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా అవకాశం ఇచ్చినందుకు ఆనందంగా ఉంది. ఈ పదవిని బాధ్యతగా భావించి పట్టణాభివృద్ధికి కృషి చేస్తా. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య సూచనలతో ముందుకు వెళతా. పట్టణంలో శానిటేషన్ మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటా.

- నార్ల భువన సుందరి, చైర్‌పర్సన్

నాడు సహకారం.. నేడు ధిక్కారం!

డీసీసీబీ చైర్మన్ ఎంపికపై తెగని పంచాయితీ



- డీసీసీబీ చైర్మన్ ఎవరో..
- రసవత్తరంగా మారిన ఎంపిక
- తాజాగా పది జిల్లాలకు ప్రకటన
- ఉమ్మడి జిల్లా చైర్మన్ వాయిదా
- నీరుగారిన ఆశావహులు
- టీడీపీ,జనసేన మధ్య వార్
- తొలుత టీడీపీకే నిర్ణయం
- పశ్చిమ జనసేనకు
- మారిన పరిణామాలు
- పదవుల పంపకం వాయిదా
- ఎంపికపై అయోమయం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డీసీసీబీ చైర్మన్ ఎంపిక రసకందాయంలో పడింది. రేపో మాపో టీడీపీ నుంచి నామినేటెడ్ చైర్మన్ పేరు ప్రకటించడానికి అంతా సిద్ధమైందనుకున్న తరుణంలో చివర్లో జిల్లా పేరే జాబితాలో మాయమైపోయింది. రాష్ట్రంలో పది ఉమ్మడి జిల్లాల్లో నామినేటెడ్ డీసీసీబీ చైర్మన్లను సోమవారం ప్రకటించిన ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ పేరును పక్కన పెట్టేసింది. దీంతో ఈ పదవి ఎవరిని వరిస్తుందనేది ఉత్కంఠగా మారింది. అదే సమయంలో పక్కనే ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ పేరును కూడా వాయిదా వేయడంతో మరింత సస్పెన్స్ నెలకొనేలా చేసింది. ఈ రెండు ఉమ్మడి జిల్లాల్లో చైర్మన్ కుర్చీ టీడీపీ, జనసేనలో ఎవరు ఏది పంచుకోవాలనేదానిపై ఇరుపార్టీల మధ్య ఏర్పడ్డ సందిగ్ధతే దీని కారణం. వాస్తవానికి ఉమ్మడి పశ్చిమ చైర్మన్ కుర్చీ జనసేన, ఉమ్మడి తూర్పు కుర్చీ టీడీపీ తీసుకోవాలని గతంలో నిర్ణయించాయి. చివర్లో పశ్చిమ చైర్మన్ కుర్చీ కచ్చితంగా తమకు ఇవ్వాల్సిందేనని టీడీపీ పట్టుబట్టింది. ఇరుపార్టీల మధ్య నెలకొన్న కుర్చీల పంపకం గందరగోళంతో ఉభయగోదావరి జిల్లాల్లో ఎంపికను సీఎం వాయిదావేశారు. ఈక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్ కుర్చీలో

అంతా సిద్ధమే.. ఈలోగా..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ పాలకవర్గం రద్దయింది. అప్పటివరకు వైసీపీ ప్రభుత్వంలో కొనసాగిన డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజుతో సహా మొత్తం బోర్డు రాజీనామా చేయడంతో గతేడాది జూన్ నుంచి డీసీసీబీ చైర్మన్ కుర్చీ ఖాళీ అయింది. అయితే ఇప్పట్లో డీసీసీబీకి ఎన్నికలు నిర్వహించే వీలులేక తాత్కాలికంగా చైర్మన్ పోస్టును నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక నామినేటెడ్ పోస్టులు ఖాళీగా ఉండడంతో సీఎం చంద్రబాబు గత కొన్ని నెలలుగా కసరత్తు చేసి టీడీపీ, జనసేన నేతలతో భర్తీ చేశారు. ఉమ్మడి జిల్లాలో రాష్ట్రస్థాయి పౌర సరఫరాల సంస్థ చైర్మన్, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్మన్ వంటి పలు కీలక పోస్టులను జనసేనకు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న డీసీసీబీ చైర్మన్ కుర్చీని మాత్రం టీడీపీకి కేటాయించాలని ఎమ్మెల్యేలు, పార్టీ ఆశావహుల నుంచి టీడీపీ అధినేతపై ఒత్తిళ్లు పెరిగాయి. ఉమ్మడి జిల్లాలో అనేక కీలక నామినేటెడ్ పోస్టులు జనసేనకు కట్టబెట్టడంతో డీసీసీబీ టీడీపీకి, డీసీఎంఎస్ జనసేనకు ఇవ్వాలని ప్రతిపాదించారు. అదే సమయంలో డీసీసీబీ చైర్మన్ జనసేనకు, డీసీఎంఎస్ టీడీపీకి ఇవ్వాలని జనసేన నుంచి ఒత్తిడి అధికమైంది. దీంతో ఇరుపార్టీల కీలక నేతల మధ్య కొన్ని నెలల కిందట జరిగిన చర్చల్లో ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్ టీడీపీకి, ఉమ్మడి పశ్చిమ డీసీసీబీ చైర్మన్ జనసేన పంచుకునేలా సూత్రప్రాయంగా ఒప్పందం కుదిరింది. ఉమ్మడి తూర్పు చైర్మన్ కుర్చీ టీడీపీకి ఖాయం అనే సంకేతాలు అందడంతో అనేక మంది టీడీపీ నేతలు తీవ్రంగా ప్రయత్నించారు. తమ గాడ్‌ఫాదర్లను, అనుకూల ఎమ్మెల్యేలను కలిసి తమ పేరు ప్రతిపాదించేలా పావులు కదిపారు. ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖలు సేకరించారు.



కూర్చునేది ఎవరినేది ఆసక్తికరంగా మారింది.

ఆశావహులకు నిరాశ..

గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన జ్యోతుల నవీన్ తనకు ఎన్నికల్లో కాకినాడ ఎంపీ టికెట్ ఎలాగూ రానందున డీసీసీబీ చైర్మన్ కుర్చీ కావాలని అధిష్ఠానం వద్ద ప్రతిపాదించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఉమ్మడి జిల్లాలో పది మంది ఎమ్మెల్యేల నుంచి తన పేరును ప్రతిపాదిస్తూ సిఫార్సు లేఖలు తీసుకున్నారు. పలువురు మంత్రుల ద్వారా రాయబారం నడిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటు చేజారినందున చైర్మన్ కుర్చీ అయినా ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. కోనసీమ జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నేత మెట్ల రమణబాబు, కిర్లంపూడికి చెందిన మాజీ జడ్పీటీసీ తోట నవీన్, కాకినాడ రూరల్ టీడీపీ సీనియర్ నేత పిల్లి సత్తిబాబు సైతం పదవి ఆశించారు. తమకు చైర్మన్ పదవి వరించడం ఖాయమని ఎవరికివారే లెక్కలేసుకున్న తరుణంలో అనూహ్యంగా సోమవారం ప్రకటించిన చైర్మన్ల జాబితాలో ఉమ్మడి జిల్లా పేరు లేకపోవడంతో ఆశావహులంతా కంగుతిన్నారు.

ఏ కుర్చీ ఎవరికో..

జనసేనకు ఇవ్వాలనుకున్న పశ్చిమగోదావరి డీసీసీబీ చైర్మన్ కుర్చీ తమకే కావాలంటూ కొన్ని రోజులుగా అక్కడ టీడీపీ నేతలు పార్టీపై ఒత్తిడి తెస్తున్నారు. తాజా ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్ దక్కనివారి నుంచి పదవులు రాని నేతలంతా తమకు చైర్మన్ పదవి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. జనసేనకు బదులు కుర్చీ టీడీపీకే ఇవ్వాలని చంద్రబాబు, లోకేశ్‌పై ఒత్తిడి తెచ్చారు. పైగా 2014లో ఉంగుటూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గన్ని వీరాంజనేయులు 2019లో ఓడిపోయారు. ప్రస్తుతం ఏలూరు పార్లమెంట్ టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే ఈయనకు పదవి ఇస్తామని పార్టీ ఇది వరకే హామీ ఇచ్చింది. ఆ తర్వాత ఆప్కాబ్ చైర్మన్ పదవి ఇస్తానని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆప్కాబ్ కాకపోయినా డీసీసీబీ కుర్చీ ఇవ్వాల్సిన పరిస్థితి. మరికొందరు సీనియర్లు సైతం తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఈనేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ చైర్మన్ టీడీపీ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదే జరిగితే ఉమ్మడి తూర్పు కుర్చీని టీడీపీ వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో మళ్లీ టీడీపీ, జనసేన గతంలో నిర్ణయించుకున్న జిల్లాల కుర్చీలు మార్చుకోవాల్సి వస్తోంది. ఈ తలనొప్పులు ప్రస్తుతం తేల్చే పరిస్థితి లేక ఈ రెండు ఉమ్మడి జిల్లాల డీసీసీబీ కుర్చీల చైర్మన్లను సీఎం ప్రకటించకుండా వాయిదా వేశారు. ఉమ్మడి తూర్పు కుర్చీ జనసేనకు విడిచిపెడితే ఇక్కడ టీడీపీ సీనియర్లు, ఆశావహులు మరింత గుర్రుగా మారనున్నారు. ఇప్పటికే కీలక పదవులు జనసేనకు వెళ్లడంతో ఇది కూడా వదిలేసుకుంటే ఎలా అనే నిట్టూర్పులు వ్యక్తం కానున్నాయి. పోనీ జనసేన ఇప్పటివరకు దీనిపై ఆశలు పెట్టుకోకపోవడంతో అసలు అభ్యర్థే లేని పరిస్థితి. ఇదిలా ఉంటే తాజాగా ప్రకటించిన డీసీసీబీ చైర్మన్ పదవులు ఆరు నెలలు మాత్రమే ఉంటాయి. ఈలోపు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ కుదరకపోతే మరో ఆరునెలల చొప్పున చైర్మన్ పోస్టును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించుకుంటూ వెళ్లవచ్చు.

మే 3న నిడదవోలులో మెగా జాబ్‌మేళా

నిడదవోలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి మే 3వ తేదీన ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిడదవోలులో నిర్వహించే మెగా జాబ్ మేళాలో 45 కంపెనీలు 1302 మందికి ఉద్యో గాలు కల్పించే అవకాశం ఉందన్నారు. అర్హతను బట్టి రూ.12 వేల నుంచి రూ.40 వేల వరకు జీతం ఇస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్, పీజీ పాసైన 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ యువకులు మే 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే మెగా జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు.

126 మంది దివ్యాంగులకు కలెక్టర్ అభినందన

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లల అసమాన ప్రతిభ ఎందరికో స్ఫూర్తిని నింపిందని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. జిల్లావ్యాప్తంగా పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రత్యేక అవసరాలు గల పిల్లలు 126 మందిని సోమవారం కలెక్టర్ తన చాంబర్‌లో కలిపి ప్రత్యేకంగా అభినందించారు.ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు 88.86 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.మొదటి స్థానంలో నిలిచిన రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్‌సిటీకి చెందిన చిరంజీవి శివశంకర్,రాజమహేంద్రవరానికి చెందిన నవ్యశ్రీ, తాళ్ళపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన ఆకుల లావణ్యలక్ష్మి తదితరులను అభినందించారు.

మాకు.. సెలవుల్లేవా.. తాతయ్యా!

అంగన్‌వాడీలకు వేసవి సెలవుల్లేవ్



- నేటికీ కొనసాగింపు
- పెరుగుతున్న ఎండలు
- 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు
- చిన్నారుల ఆపసోపాలు
- అయినా పట్టని ప్రభుత్వం
- నేటికీ విడుదల కాని ప్రకటన
- తగ్గుతున్న హాజరుశాతం
- సెలవులకు డిమాండ్

దివాన్‌చెరువు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అన్ని స్కూళ్లకు వేసవి సెలవులు ఇచ్చేశారు.. ఒక్క అంగన్‌వాడీలకు తప్ప.. దీంతో మాకెప్పుడిస్తారు తాతయ్యా సెలవులు అంటూ చిన్నారులు మారం చేస్తున్నారు. పెద్ద పిల్లలకేనా ఎండలు మాకు కాదా అంటూ బోరు బోరుమంటున్నారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా రాష్ట్రంలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు ప్రభుత్వం ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించింది. కానీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందించే అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తున్నాయి. దీంతో ఈ కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఎండతీవ్రత తట్టుకోలేక ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్వ ప్రాథమిక విద్య కోసం 3 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులు వస్తారు. రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టుపరిధిలోని రాజానగరం, రాజమహేంద్రవరం ,కడియం మండలాల్లో దాదాపు 300 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తుండగా రాజానగరం మండలంలో సుమారు 100 అంగన్‌వాడీ కేంద్రాలు 591 మంది బాలింతలు, 530 మంది గర్భిణులతో పాటు మూడు నుంచి ఐదేళ్లలోపు వయసు గల దాదాపు 2270 మంది పిల్లలకు సేవలందిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు ఉదయం హుషారుగా వస్తున్న చిన్నారులు మధ్యాహ్నానికి వాడిపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 15వ తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు ఒంటిపూట పనిచేస్తున్నాయి.ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కేంద్రం పనివేళలుగా ప్రభుత్వం నిర్ణయించి నిర్వహిస్తోంది. కేంద్రం పనివేళలకు ముందుగానే కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకువెళ్తుండగా , మరి కొంతమంది అసలు తమ పిల్లలను కేంద్రాలకు పంపడంలేదని తెలిసింది. సాధారణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల అన్నలు, అక్కలు ప్రభుత్వ పాఠశాలల్లోనో, ప్రైవేట్ పాఠశాలల్లోనో చదువుతూ ఉంటారు. ఆయా పాఠశాలలకు వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఈ నెల 24 నుంచి సెలవులు ప్రకటించారు. దాదాపు 50 రోజుల తర్వాత జూన్ 13 నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం అవుతాయి. సాధారణంగా ఈ సెలవు రోజుల్లో పిల్లలు వారిబంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వకపోవడంతో చిన్నారులంతా ఇంటి వద్దే ఉండి ప్రతి రోజూ కేంద్రాలకు వస్తున్నారు. మున్ముందు వేసవి తీవ్రత పెరిగే అవకాశం ఉంది. దానిని తట్టుకోలేని చిన్నారులెవరైనా అస్వస్థతకు గురవుతారేమోనన్న ఆందోళన కొంతమంది వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారాన్ని వేసవిసెలవులు సమయంలో టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్)గా అందజేయవచ్చునని సూచిస్తున్నారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే వర్కర్లు, సహాయకులకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరుతున్నారు.ప్రతి ఏటా మే నెలలో వర్కర్లు, సహాయకులకు చెరో 15 రోజులు వంతున వేసవి సెలవులు ప్రభుత్వం ఇస్తోంది. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేం ద్రాలకు సెలవులు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.



పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యలు వింటున్న అధికారులు

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దు

పీజీఆర్ఎస్‌లో అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో జేసీ ఎస్.చిన్నరాముడుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వహించవద్దన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన ఆడిట్‌ను ప్రతి శాఖ తప్పక చేయించాలన్నారు.కిందస్థాయి ఉద్యోగులు చూపిన పరిష్కారంపై ఫిర్యాదుదారులు సంతృప్తి చెందక పైస్థాయి అధికారి లాగిన్‌కి పంపితే జిల్లా స్థాయి అధికారులే స్వయంగా పరిష్కరించాలన్నారు.కిందిస్థాయి ఉద్యోగులకు తిప్పి పంపవద్దన్నారు. తమ లాగిన్‌కు వచ్చిన ఫిర్యాదుపై తప్పక విచారణ చేసి సాక్ష్యాలు దగ్గర ఉంచుకోవాలని స్పష్టం చేశారు. విచారణ తేదీ సమయాన్ని సూచిస్తూ ఫిర్యాదుదారుడుకి నోటీసు పంపాలన్నారు.పీజీఆర్ఎస్‌లో సోమవారం 189 అర్జీలు స్వీకరించారు.తాళ్ళపూడి అన్నదేవరపేటలో పంచాయతీ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని కొండె అనిల్ కుమార్, రాజమహేంద్రవరానికి చెందిన పి.లీలాకృష్ణ రాజమండ్రి నగరపాలక సంస్థలో ఉద్యోగం నిమిత్తం, ధవళేశ్వరానికి చెందిన పిల్లి ఉమా ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నారు. పలువురు సమస్యలపై విన్నవించారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వైద్య ఉద్యోగులు

వెల్ల పసరు మందుకు వందేళ్లు!

నేటికీ తగ్గని కామెర్ల రోగుల ఆదరణ

నూరేళ్ల నుంచి సేవలు అందిస్తున్న గుండుబోగుల కుటుంబీకులు

నేడు శతాబ్ది ఉత్సవం



కామెర్లమందు ప్యాకెట్లు పంపిణీ.. మందు ఉండలుగా తయారు చేస్తున్న దృశ్యం



వెల్ల పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది కామెర్ల పసర మందు.. దశాబ్దాల కాలంగా కామెర్ల వ్యాధి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాల ప్రజలు వెల్ల పసరు మందునే ఆశ్రయిస్తూ వచ్చారు. వెల్ల గ్రామం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలో ఉంది. కాలేయానికి వచ్చే కామెర్ల వ్యాధికి 1920 నుంచి పసరుమందు పంపిణీ చేస్తూ కామెర్ల రోగులకు సేవలు అందిస్తున్నారు దివంగత గుండుబోగుల సూర్యారావు కుటుంబీకులు. కామెర్ల మందు పంపిణీ ప్రారంభించి వందేళ్లు పూర్తికాగా మంగళవారం శతాబ్ది ఉత్సవం నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. ఈ సందర్భంగా వందేళ్ల పసరు మందుపై ప్రత్యేక కథనం..

ద్రాక్షారామ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కామెర్ల మందు తయారీ వెనుక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. 1920 ప్రాంతంలో వెల్ల గ్రామానికి సాధుపుంగవుడు దేశాటనలో భాగంగా వచ్చాడు. సాధువుకు గుండుబోగుల సూర్యారావు ఆశ్రయమిచ్చి సపర్యలు చేశారు. వారం రోజులపాటు ఉన్న సాధువు సూర్యారావు సేవాభావం చూసి ఆయనకు మంత్రోపదేశం చేసి కామెర్ల మందు తయారీ విధానం వివరించారని చెబుతారు. అయితే ఇది పూర్తి సేవాభావంతోనే మందు పంపిణీ చేయాలని షరతు పెట్టారట. సాధువు ఆదేశాలతో 1920లో గుండుబోగులు సూర్యారావు కామెర్ల మందు పంపిణీ ప్రారంభించారు. తొలుత గ్రామంలో వారికి ఇచ్చేవారు. కొన్నాళ్లకు చుట్టుపక్కల గ్రామాల వారు వచ్చి మందు తీసుకునేవారు. తదుపరి ఇతర ప్రాంతాల నుంచి కామెర్ల మందుకు రోగులు రావడం ప్రారంభమైంది. అలా ప్రాచుర్యంలోకి వచ్చిందే వెల్ల కామెర్ల పసరు మందు.

యాగాణి.. అర్ధణాకు...

పసరు మందు తొలినాళ్లలో ఉచితంగా పంపిణీ చేసేవారు సూర్యారావు. మందుకు ఆదరణ పెరగడంతోపాటు ఎక్కువగా మందు తయారీ పదుల సంఖ్యలో కూలీలు పని చేసేవారు. ఆకులు కోసుకురావడం, రుబ్బు రోళ్లపై రుబ్బి పసరు మందు తయారీచేసేవారు. తదుపరి గ్రైండర్లు, ప్రస్తుతం మందుతయారీ, ప్యాకింగ్‌కు పూర్తిగా యంత్రాలను వాడుతున్నారు. తొలినాళ్లలో ఖర్చులకుగాను యాగాణి తదుపరి అర్ధణా తీసుకునేవారు. 1984 నాటికి ప్యాకెట్టు పావలా తీసుకునేవారు. ప్రస్తుతం ప్యాకెట్టుకు రూ.10. పెట్టారు.

ఆదివారం వచ్చిందంటే హడావుడి..

ప్రతీ ఆదివారం వెల్లలో కామెర్లమందు పంపిణీ చేస్తుంటారు. ఆదివారం వచ్చిందంటే కామెర్ల రోగులు, బంధువులతో వెల్లలో హడావుడిగా ఉంటుంది. ప్రతీ ఆదివారం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. జూలై నుంచి సెప్టెంబరు వరకు సీజన్‌లో వేలసంఖ్యలో రోగులు వస్తుంటారు. కామెర్ల రోగులు ఈ పసరు మందును పాలతో వేసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాలు, ఆముదం, రోగులతో వచ్చినవారికి అల్పాహారం అమ్మకాలు సాగిస్తూ గ్రామంలో పదుల సంఖ్యలో కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. వాహనాలు పార్కింగ్ ద్వారా, మందు తయారీకి ఆకు సమకూర్చడం ద్వారా మరికొంతమంది ఉపాధి పొందుతున్నారు. ఇక కామెర్ల మందు పంపిణీతోపాటు మందు వాడవలసిన విధానం, చేయవలసిన పత్యం, తినకూడని వివరాలు గుండుబోగుల కుటుంబీకులు వివరిస్తారు. అదే విధంగా కామెర్లు ఎక్కువగా ఉన్న రోగులను పరీక్ష చేస్తారు. సూచనలు, సలహాలు ఇస్తారు. తదుపరి మందు పంపిణీ ప్రారంభిస్తారు.

వెల్లకు ప్రత్యేక బస్సులు

ఆదివారం కామెర్ల రోగులకు పలు జిల్లాల నుంచి వెల్లకు నేరుగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. శ్రీకాకుళం, విజయనగరం, భీమవరం నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయి. ఆటోలైతే ఆదివారం 100కు పైగా వస్తాయి.


రాష్ట్రపతి భవన్‌కు వెల్ల మందు

కామెర్ల రోగానికి గతంలో అల్లోపతిలో వైద్య విధానం అందుబాటులో లేదు. దీంతో వెల్ల మందు కామెర్ల రోగుల పాలిట సంజీవనిగా మారింది. దీంతో వేలాది మంది రోగులు వెల్ల పసరు మందుతో ఉపశమనం పొందేవారు. దివంగత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి కుటుంబీకుల్లో ఒకరికి కామెర్లు వచ్చాయి. దీంతో సంజీవరెడ్డి కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది మల్లిడి హరినాథరెడ్డికి ఫోన్‌చేసి వివరాలు అడిగారు. దీంతో హరినాథరెడ్డి వినతి మేరకు దివంగత గుండుబోగుల సూర్యారావు ఢిల్లీ వెళ్లి పదిరోజులపాటు రాష్ట్రపతి భవన్‌లో ఉండి మందు తయారుచేసి ఇచ్చి వచ్చారు. శతాబ్ది ఉత్సవ వేళ హరినాథరెడ్డి ఈ విషయాలను పంచుకున్నారు.

సూర్యారావు విగ్రహం ఆవిష్కరణ

దివంగత గుండుబోగుల సూర్యారావు వెల్ల గ్రామంలో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని 2005 ఆగస్టు పదో తేదీన చంద్రబాబు ఆవిష్కరించారు. అలాగే వెల్ల కామెర్ల వైద్యులు గుండుబోగుల స్వామినాయుడు ఇంటికి వెళ్లి గుండుబోగుల కుటుంబీకులను అభినందించారు. కామెర్లమందు తయారుచేసిన గుండుబోగుల సూర్యారావు ఎన్నో సత్కారాలు అందుకున్నారు. దర్శకరత్న దాసరి నారాయణరావు 1983లో సూర్యారావును సత్కరించి కామెర్ల వైద్యరత్న బిరుదును ప్రదానం చేశారు. తదనంతరం గుండుబోగుల నాగయ్యకాపు, స్వామినాయుడులను భీమవరంలో సినీనటుడు రవితేజ, నటుడు సునీల్, దర్శకుడు వీవీ వినాయక్‌ల చేతులమీదుగా సత్కరించారు.





గుండుబోగుల సూర్యారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు (ఫైల్)

నేడు శతాబ్ది ఉత్సవం..

వెల్ల పసరు మందుకు వందేళ్లు పూర్తికావడంతో మంగళవారం శతాబ్ది ఉత్సవం నిర్వహిస్తున్నారు. సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8 వరకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర భారీపరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హాజరవుతున్నారు. మంత్రులు సుభాష్, కందుల దుర్గేష్, ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరుకానున్నారు. వెబ్‌సైట్, డిజిటల్ లాంచ్ కూడా నిర్వహిస్తారు.

కామెర్ల మందు పంపిణీలో మూడు తరాలు

కామెర్ల మందు తయారీ ప్రారంభించిన గుండుబోగుల సూర్యారావు 20 జనవరి 1984లో మృతి చెందారు. గుండుబోగుల సూర్యారావు ఆదివారం ఏ పరిస్థితుల్లోనూ మందు పంపిణీ చేయాలని, తాను మరణించినా మందు పంపిణీ కొనసాగించాలని కుమారులకు నిర్దేశించారు. ఏకారణంగానూ రోగులు ఇబ్బంది పడకూడదని చెప్పారు. సూర్యారావు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందగా అంత్యక్రియలు నిర్వహించి కుమారులు అనంతరం మందు పంపిణీ చేశారు. తదుపరి ఆయన కుమారులు గుండుబోగులు నాగయ్యకాపు, గుండుబోగుల స్వామినాయుడు, కుమార్తె పాముల వీర్రాజమ్మ మందు పంపిణీ చేసేవారు. కాలక్రమంలో నాగయ్యకాపు, ఇటీవల స్వామినాయుడు కూడా మృతి చెందారు. దీంతో పాముల వీర్రాజమ్మ, కుమారులు వీరభద్రరావు, చక్రధరరావు, సురేష్‌కుమార్, నాగయ్యకాపు కుమారుడు లక్ష్మణరావు, స్వామినాయుడు కుమారులు సుధాకర్, రమేష్ అచ్యుత్ కామెర్ల మందు తయారీచేసి పంపిణీ చేస్తున్నారు.



వెల్ల మందు కోసం క్యూలైన్లలో ఉన్న జనం



కరప మండలం పాతర్లగడ్డలో పంచాయతీ చెరువుపై పరుచుకున్న పచ్చదనం



పచ్చని దుప్పటి!

ఈ చిత్రాన్ని చూసి ఏదో పచ్చని పంటను కుంటే మీరు పొరబడినట్టే. కాకినాడ జిల్లా కరప మండలం పాతర్లగడ్డలో గ్రామ పంచాయతీకి చెందిన చెరువు ఇది. పిస్టియా అనే నీటి మొక్క చెరువంతా ఇలా అల్లుకుపోయి పచ్చదనాన్ని సంతరించుకుంది. ఈ సుందర దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి తన కెమెరాలో ఇలా బంధించింది. చెరువంతా కప్పేసిన ఈ మొక్కను నీటి కాబేజీ లేదా నీటి కరివేపాకు అని పిలుస్తారని జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు అరుణ తెలిపారు. -ఆంధ్రజ్యోతి, కరప

విజ్ఞానం.. వినోదం..

- గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన విజ్ఞాన శిబిరాలు
- జూన్ 6 వరకు నిర్వహణ
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 102 గ్రంథాలయాల్లో ప్రారంభం



కాకినాడ వివేకానంద పార్కులో మాట్లాడుతున్న సమాచారపౌర సంబంధాలశాఖ డీడీ నాగార్జున

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వేసవి సెలవులు రాగానే పిల్లలందరూ ఆటపాటలతో సరదాగా గడుపుతారు. బంధువుల ఇళ్లకు వెళ్తారు. ఈ వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా, ఆటపాటలతో చిన్నారుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేలా గ్రంథాలయ సంస్థ ఈ ఏడాది విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తోంది. గతేడాది కంటే ఈ ఏడాది కాస్త ముందుగానే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న 102శాఖా గ్రంథాలయాల్లో ఈ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది.

వేసవిసెలవుల్లో చిన్నారులు కొంత సమయం విజ్ఞాన సముపార్జనకు కేటాయించేలా ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలను ఏటా నిర్వహిస్తోంది. టీడీపీ ప్రభుత్వహయాంలో మొదలుపెట్టిన ఈకార్యక్రమం వేలాదిమంది చిన్నారులు తమలోని ప్రతిభకు మెరుగులు దిద్దుకోవడానికి వేదికగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణితోపాటు గ్రామీణగ్రంథాలయాలు మొత్తం 102వరకు ఉన్నాయి. ప్రతి మండల కేంద్రంతోపాటు ముఖ్యమైనగ్రామాల్లోనూ గ్రంథాలయాలు ఉన్నాయి. వీటి స్థాయికి తగ్గట్టుగా శిక్షణ శిబిరాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. చిన్నారులకు అల్పాహారం, బహుమతులు తదితర వాటికి ఈ నిధులు కేటాయిస్తోంది.సోమవారంనుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరాలు జూన్ 6 వరకు కొనసాగనున్నాయి. రోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు శిక్షణ ఉంటుంది. ఆటపాటలు, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్ కార్యక్రమాలు ఉంటాయి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

పాఠశాల విద్యార్థుల్లో సమగ్ర వికాసం పెంపొందించేందుకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా గ్రంథాలయ సంస్థ నిర్వహించే వేసవి శిక్షణ తరగతులు దోహదపడతాయని సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ డి.నాగార్జున అన్నారు. కాకినాడ వివేకానంద పార్కులోని గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ విఠల్

పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఆరోగ్య ప్రదాయిని అయిన కాకినాడ జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ ఎం.పాండురంగ విఠల్‌కు సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ లావణ్యకుమారి అనారోగ్య కారణంగా సెలవులో ఉండడంతో డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విఠల్ మాట్లాడుతూ రోగులు, క్షతగాత్రులు, గర్భిణులు, బాలింతలకు చికిత్స, సేవలు, మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. వైద్యులు, సిబ్బంది సమన్వయ సహకారంతో ఆసుపత్రిని ప్రగతి పథంలో పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడతామన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ఆసుపత్రిలోని అన్ని వార్డుల్లో ఫ్యాన్లు సక్రమంగా పని చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా అత్యవసర విభాగంలో మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్న ఎక్స్‌రే యూనిట్, ఈవోటీలో సీఆర్మ్ మెషీన్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. జీజీహెచ్‌ను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ విఠల్‌ను అన్ని విభాగాల వైద్యులు, మినిస్టీరియల్ సిబ్బంది, టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ సిబ్బంది అభినందించారు.

రేపే పాలిసెట్

- 28 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 9,525 మంది విద్యార్థులు
- కాకినాడ జిల్లా సమన్వయకర్త జనార్దనరావు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిసెట్-2025 బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కాకినాడ జిల్లా సమన్వయకర్త డాక్టర్ నల్లి జనార్దనరావు తెలిపారు. కాకినాడ జిల్లాలోని 28 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా మొత్తం 9,525 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఈ ఏడాది విద్యార్థుల సౌకర్యార్థం పిఠాపురంలో కూడా కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, 11గంటల తర్వాత వచ్చిన వారిని అనుమతించమన్నారు. హాల్ టికెట్‌తో పాటు పెన్, పెన్సిల్, రబ్బరు తెచ్చుకోవాలని సూచించారు. కాకినాడలోని 21 కేంద్రాల్లో 7,186 మంది, పిఠాపురంలోని ఏడు కేంద్రాల్లో 2,339 మంది ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారు. ఫీజు ఫెయిల్యూర్, రిఫండ్, ఇతర కారణాల వల్ల హాల్ టికెట్ జనరేట్ కాకపోయినా అభ్యర్థులు కాకినాడ ఏపీటీలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సమన్వయకర్త జనార్దనరావు కోరారు.

రివైజ్డ్ పోర్టల్‌పై శిక్షణ

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలకు హెచ్ఎంఐఎస్, ఆర్‌సీహెచ్ పోర్టల్, అన్మోల్ అప్లికేషన్‌పై డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కుళాయి చెరువు ప్రాంగణంలోని కాకినాడ స్మార్ట్‌సిటీ హాలులో జరిగిన సమావేశంలో డాక్టర్ నాయక్ మాట్లాడుతూ అర్బన్, రూరల్ హెల్త్ సెంటర్లలో హెచ్ఎంఐఎస్ పోర్టల్, ఆర్‌సీహెచ్ పోర్టల్ ఏ విధంగా చేయాలో (వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్, ప్రెగ్నెంట్ ఉమెన్ రిజిస్ట్రేషన్, ఎంసీహెచ్ సర్వీస్, అనీమియా డేటా) క్షుణ్ణంగా వివరించారు. ఏఎన్ఎంలు, ఆశాలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, వైద్యులు క్షేత్రస్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. తద్వారా జిల్లావ్యాప్తంగా ఒక ప్రణాళిక ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయడం వల్ల ఇమ్యూనైజేషన్‌ను నూటికి నూరు శాతం విజయవంతం చేయవచ్చన్నారు. ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ వి.అరుణ, ఎఫ్ఆర్‌టీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విల్సన్, ఎస్‌వో విజయలక్ష్మి, డెమో ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.



సత్యదేవుని దర్శనానంతరం రఘురామకృష్ణరాజు దంపతులు

సత్యదేవుని సన్నిధిలో డిప్యూటీ స్పీకర్

అన్నవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సోమవారం కుటుంబసభ్యులతో కలిసి విచ్చేశారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు, సహాయ కమిషనరు సీహెచ్ రామ్మోహనరావు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏఈవో కొండలరావు పాల్గొన్నారు.



మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో సుబ్బారావు

సత్యదేవుని కల్యాణోత్సవాలకు మంత్రికి ఆహ్వానం

అన్నవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8వ తేదీన జరిగే అన్నవరం సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలకు విచ్చేయాల్సిందిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావు సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కల్యాణోత్సవ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఈవోకు సూచించారు.



అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి మూర్తి

జేఎన్టీయూకే, వాద్వానీ ఫౌండేషన్ మధ్య ఎంవోయూ

జేఎన్టీయూకే, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని వైస్ చాన్సలర్ సమావేశ హాలులో బెంగళూరుకు చెందిన వాద్వానీ ఫౌండేషన్, జేఎన్టీయూకే మధ్య అవగాహన ఒప్పందంపై సోమవారం చర్చ జరిగింది. వర్సిటీ నుంచి ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, వాద్వానీ ఫౌండేషన్ నుంచి మూర్తి పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ ఎంవోయూ కుదుర్చుకోవడం ద్వారా తమ అధ్యాపకులు కస్టమైజ్డ్ లెర్నింగ్ ప్రోగ్రాంల ద్వారా విద్యార్థులకు వ్యవస్థాపక మనస్తత్వం, వ్యాపార నైపుణ్యాలు సాధికారత కలిగిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వేదికగా నిలుస్తుందన్నారు. మూర్తి మాట్లాడుతూ జేఎన్టీయూకే అధ్యాపకులకు ఎంవోయూ ద్వారా ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాంలు నిర్వహిస్తామని, తద్వారా వారు విద్యార్థులకు 21వ శతాబ్దపు సమస్యలకు పరిష్కారాలు కనుగొంటారన్నారు. దేశంలో 75శాతం మంది పట్టభద్ర విద్యార్థులకు వినూత్నమైన స్టార్టప్ ఐడియాలు ఉన్నాయని, కానీ వాటిని సాకారం చేసుకునేందుకు సరైన ప్రణాళిక లేకపోవడంతో వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. అనంతరం ఫౌండేషన్‌తో ఎంవోయూ కుదుర్చుకునేందుకు వీసీ సుముఖత వ్యక్తం చేశారు. డీఏపీ బి.బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ వైస్ చాన్సలర్లు జీవీఆర్ ప్రసాదరాజు, రామలింగరాజు, మురళీకృష్ణ, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, ఇన్‌చార్జి డీఈ పద్మజారాణి పాల్గొన్నారు.

32 రోజులకు రూ.1.47 కోట్లు

- వాడపల్లి వెంకన్నకు రికార్డు స్థాయిలో ఆదాయం
- బంగారం 13 గ్రాములు, వెండి కిలో 380 గ్రాములు, 64 విదేశీ కరెన్సీ లభ్యం



ఆత్రేయపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను పర్యవేక్షణాధికారులు టీవీ ఎస్ఆర్ ప్రసాద్, బి.కిరణ్, నరేంద్రకుమార్ పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. 32 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.1,19,16,439, అన్న ప్రసాద హుండీల ద్వారా 24,51,230... మొత్తం రూ.1,47,12,969 ఆదాయం లభించింది. బంగారం 13 గ్రాములు, వెండి కిలో .380 గ్రాములు, 64 పలు దేశాల విదేశీ కరెన్సీ లభించాయి. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3,45,300 లభించినట్టు ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. లెక్కింపులో వాడపల్లి గ్రామస్తులు, బ్యాంకు అధికారులు, పోలీసులు, సేవకులు, దేవస్థానం సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.





వాడపల్లి వెంకన్న సన్నిధిలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

తీపర్రులో జిల్లా స్థాయి బీచ్ కబడ్డీ పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పెరవలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీపర్రు గోదావరి తీరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి బీచ్ కబడ్డీ ఎంపిక పోటీలు సోమవారం జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి అప్పలరాజు, యలమరెడ్డి శ్రీకాంత్, కె.రంగారావు తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సింహాద్రి సత్యనారాయణ, మేకా రంగారావు, సంకు సూర్యనారాయణ, వాటాల వెంకటేశ్వరరావు, మల్లాడి రాంబాబు తదితరులు సహకారం అందించారు. ఇందులో మొత్తం 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన వారు వచ్చేనెల 2,3,4 తేదీల్లో కాకినాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

సర్వపృష్ఠ ఆప్తోర్యామ యాగం చేయడం అదృష్టం



యాగపూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సచ్చిదానంద తీర్థస్వామి

అంబాజీపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంతంలోని తొండవరంలో సర్వపృష్ఠ ఆప్తోర్యామ యాగం చేయడం ఎంతో అదృష్టమని, ఈ యాగం దర్శించడం ద్వారా ఎంతో పుణ్యమని ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌కు చెందిన సచ్చిదానంద తీర్థస్వామి పేర్కొన్నారు. తొండవరం శ్రీఉమా తొండేశ్వరస్వామి ఆలయ ప్రాంగణ సమీపంలో జరుగుతున్న సర్వపృష్ఠ ఆప్తోర్యామ యాగాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 60ఏళ్ల తరువాత ఈ యాగాన్ని నిర్వహించడం ఎంతో పుణ్యఫలమన్నారు. లోకకల్యాణార్థం ఈ యాగాన్ని దర్శించడం ఎంతో మంచిదన్నారు. 2020లో తాను శృంగేరి పీఠాధిపతి విధుశేఖరభారతి స్వామిజీ ఆశీస్సులతో అమరావతిలో భారీ యాగాన్ని నిర్వహించినట్టు స్వామిజీ తెలిపారు. కోనసీమ ప్రాంతంలో ఎన్నో ప్రముఖ దేవాలయాలు ఉన్నాయని, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అదృష్టమన్నారు.

మైనార్టీ వర్గాల రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ (ఎఫ్‌ఏసీ) సునీల్‌కుమార్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అల్ప సంఖ్యాక (మైనార్టీ) వర్గాలకు చెందిన వారికి సబ్సిడీతో కూడిన రుణాలు కోసం అర్హత కల్గిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ (ఎఫ్‌ఏసీ) ఎం.సునీల్ కుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మైనార్టీ వర్గాలైన ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శిలకు వివిధ బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులను తమకు దగ్గరలోని మీ సేవ లేదా ఇంటర్నెట్ సెంటర్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింటుతోపాటు రైస్‌కార్డు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం నకళ్లను దరఖాస్తుదారుల మండలం, మున్సిపాల్టీ, కార్పొరేషన్ కార్యాలయాల్లో అందజేయాలని,అక్కడ నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

మురమండలో గడ్డి వాము దగ్ధం

కడియం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలోని మురమండలో సోమవారం పాడిరైతు ముత్యాల రామకృష్ణకు చెందిన గడ్డి వాము దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో మండపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో సుమారు రూ.60 వేల మేర నష్టం సంభవించినట్టు రైతు తెలిపారు.

గోదారి మారే దారేది!



జీవనది.. ఒకనాడు చూస్తే పుణ్యం..ఆ నీళ్లు నెత్తిన జల్లుకుంటే మరీ పుణ్యం.. ఆ నీళ్లు తాకితే ఇంకా పుణ్యం.. మరి నేడు.. ఈ జీవ నది కాస్తా పవిత్రమనే జీవం కోల్పోయింది.. ఎటు చూసినా.. ఎక్కడ చూసినా చెత్త.. పోనీ గోదావరిలో నీరైనా బాగుందా అంటే అదీ లేదు.. ఇదిగో ఇలా నాచు పట్టి దర్శనమిస్తోంది.. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్, గౌతమి ఘాట్, కోటిలింగాల ఘాట్ అక్కడా ఇక్కడ అని ఏముంది.. ఎక్కడ చూసినా ఇంతే. గోదావరిలో దిగాలంటేనే దిగులు కనిపిస్తోంది.. గతంలో సుమారు రూ.50 లక్షలతో గోదావరిలో దిగి చెత్తను శుభ్రం చేసే యంత్రం కొనుగోలు చేసినట్టు సమాచారం. మరి ఆ యంత్రం ఏమైందో తెలియదు.. గోదావరి మాత్రం రోజురోజుకు అపరిశుభ్రంగా మారుతోంది.. అయ్యా పాలకులు.. పుష్కరాలు రాబోతున్నాయి.. ఇకనైనా మేల్కోనపోతే ఎలా.. మిగిలిన సమస్యలు తరువాత ఒకసారి జీవనది పవిత్రతను కాపాడండి..

-ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

గుండె నొప్పి అని గుర్తించి..ఇంజక్షన్ ఇచ్చారు..

- గిరిజనుడి ప్రాణం కాపాడారు
- గుండెనొప్పిగా గుర్తించిన కోతులగుట్ట సీహెచ్‌సీ వైద్యులు
- టెనెక్ట్ ప్లస్ ఇంజక్షన్ ఇచ్చి గుండెకు ఊపిరినిచ్చిన వైనం



ప్రాణాపాయం నుంచి బయటపడ్డ వెంకటనారాయణతో మాట్లాడుతున్న డాక్టర్

కూనవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉంచిన రూ.40 వేలు విలువైన గుండెకు సంబంధించిన టెనెక్ట్ ప్లస్ ఇంజక్షన్ వల్ల వైద్యాధికారులు ఒక నిరుపేద ప్రాణాలు కాపాడారు. వరరామచంద్రపురం మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన ముత్యాల వెంకటనారాయణ శనివారం అస్వస్థతకు గురికావడంతో కూనవరం మండలం కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చాడు. ఆసుపత్రికి వచ్చిన సమయంలో ఛాతిలో నొప్పి, ఒళ్లంతా చెమటలు పడుతుండడంతో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది వెంటనే ఆయనకు ఈసీజీ పరీక్షలు చేశారు. అతడికి గుండెనొప్పి వచ్చిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌బాబు, డ్యూటీ వైద్యాధికారి డాక్టర్ సి.తేజ గుర్తించారు. దీంతో వెంటనే ఆసుపత్రిలో ఉన్న రూ.40వేల టెనెక్ట్ ప్లజ్ ఇంజక్షన్ ఇచ్చారు. ఈ ఇంజక్షన్ ఇవ్వడం తో ఆ వ్యక్తికి ప్రాణాపాయం తప్పింది. మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రికి రిఫర్ చేశారు.గుండెనొప్పి రాగానే సమయానికి ఆసుపత్రికి రావడంతో ప్రాణాపాయం తప్పిందని కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి తాగుతున్న ముగ్గురు యువకుల అరెస్టు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సావరం రోడ్డులోని కొబ్బరి తోటల్లో కొందరు గంజాయి తాగుతున్నారన్న సమాచారంతో సోమవారం పట్టణ ఎస్‌ఐ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పట్టణానికి చెందిన యువకులు ధరణికోట బిందు వెంకటసాయిరాహుల్, మేడిశెట్టి సమీర్, అంబాజీపేటకు చెందిన గ్రంధి రాజు గంజాయి తాగుతున్నట్టు గుర్తించారు. తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ సమక్షంలో ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

1న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ రాక

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మధు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మే డే ఒక చారిత్రాత్మకమైన రోజని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. మేడే వేడుకల్లో పాల్గొనేందుకు మే 1వ తేదీన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ రాజమహేంద్రవరం రానున్నారని వెల్లడించారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద మెడికల్ సెక్యూరిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం(మేడే)ను కార్మికలోకం అంతా ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పెట్టుబడిదారి వ్యవస్థ ఉన్నంత వరకూ శ్రమ దోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం జరుగుతుందని, దీనికి వ్యతిరేకంగా కార్మిక చట్టాలు వచ్చాయన్నారు. మెడికల్ సెక్యూరిటీ సిబ్బందికి రూ.24,000 వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, మోహన్, కుమార్, నాగేశ్వరరావు, శారద పాల్గొన్నారు.

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలు

గోకవరం, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 1వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చినట్టు గోకవరం ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పిల్లల రాంబాబు ఆటో డ్రైవర్. 2020 సంవత్సరంలో ఆటో నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరు మృతికి కారణమయ్యాడు. దీనిపై అప్పటి ఎస్‌ఐ పి.చెన్నారావు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం రాంబాబుపై నేరం రుజువు కావడంతో జడ్జి బి.పద్మ రెండేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ముగ్గురు వ్యక్తుల అరెస్టు

60 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం, శాటిలైట్ సిటీ గ్రామాల్లో సోమవారం సారా బట్టీలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కోటం బూరయ్య, నిచ్చెనకోళ్ల శ్రీను, కోమలి కృష్ణలను అరెస్టు చేశారు. సారా కేంద్రాల సమాచారం తెలిసిన వారు 94409 02411కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలుగోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

క్రైం కార్నర్

నటి శ్రీరెడ్డిపై ఫిర్యాదు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేసి పోస్టులు పెడుతున్న నటి శ్రీరెడ్డిపై కేసు నమోదు చేయాలని తెలుగు మహిళ కాకినాడ నగర ఉపాధ్యక్షురాలు కొప్పనాతి నాగకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి కూడా శ్రీరెడ్డి సోషల్ మీడియా, యూట్యూబ్ చానల్, ఇన్‌స్టాగ్రామ్‌లలో తమ నేతలైన చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్, వంగలపూడి అనిత వారి కుటుంబ సభ్యులను ఉద్దేశించి బూతులు తిడుతూ ఇష్టమొచ్చినట్టు పోస్టులు పెడుతోందన్నారు. దీన్ని పరిశీలించి కేసు నమోదు చేయాలన్నారు. తమ ఫిర్యాదు మేరకు వన్ టౌన్‌లో ఎఫ్ఐఆర్ నెంబర్ 141/2025గా కేసు నమోదు చేశారన్నారు. ఎఫ్ఐఆర్‌లో 500, 500(2), ఐటీసీ 67, ఐటీఏ-2000-2008 సెక్షన్లు పెట్టారన్నారు.

హత్య కేసులో... ఒకరికి జీవిత ఖైదు

కాకినాడ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ కాకినాడ నాల్గో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ సోమవారం తీర్పు చెప్పారు. వివరాలివి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామానికి చెందిన పాలెపు కాసుబాబు (23), అదే ప్రాంతానికి చెందిన మల్లాడి రవికాసు మంచి స్నేహితులు. వీరిద్దరూ కలిసి 2022 జూన్ 8న కాకినాడ మెయిన్ రోడ్డులోని ఎస్ఆర్ గ్రాండ్ హోటల్‌లో రూమ్ నెం.306 అద్దెకు తీసుకున్నారు. మద్యం సేవించే క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రవికాసు బీర్ బాటిల్ పగులగొట్టి కాసుబాబును పొడిచి హతమార్చాడు. దీంతో మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి టూటౌన్ సీఐ పెద్దిరెడ్డి రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితుడు రవికాసును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వాదోపవాదాలు పూర్తికావడంతో నిందితుడికి పైవిధంగా తీర్పునిచ్చారు. అప్పటి దర్యాప్తు అధికారిగా ఉన్న రామచంద్రరావును, కోర్టులో సాక్ష్యాధారాలను సక్రమంగా ప్రవేశపెట్టిన ప్రస్తుత సీఐ మజ్జి అప్పలనాయుడును, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మిని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ప్రత్యేకంగా అభినందించారు.

మోటార్ సైక్లిస్టుకు తీవ్రగాయాలు



దేవరపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన దేవరపల్లి మండలం యర్నగూడెం గండిచెరువు వద్ద సోమవారం చోటుచేసుకుంది. యర్నగూడెం గ్రామానికి చెందిన ఇంజే సురేశ్ తన మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తుండగా తన వాహనం అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న ఫెన్సింగ్‌పోల్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో చేతికి తీవ్రగాయాల వడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు.

ఎలక్ట్రిక్ బైక్‌లో మంటలు



తగలబడిపోతున్న వాహనం

కాకినాడ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బ్యాటరీతో నడుస్తున్న ఎలక్ట్రిక్ బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన సోమవారం కాకినాడలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ వైఎస్సార్ ఫ్లైఓవర్‌పై ద్విచక్ర బ్యాటరీ వాహనం కాలిపోతున్నట్టు సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ ఎన్. రమేష్ తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని ఆరా తీశాడు. సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు తన సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. వాహనచోదకుడికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సుమారు రూ.లక్ష ఆస్తినష్టంజరిగినట్టు ఏడీఎఫ్‌వో చెప్పారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

● రోడ్డు ప్రమాదంలో మహిళ, చికిత్స పొందుతూ యువకుడు, లారీ ఢీకొని వృద్ధుడు..



రోడ్డుపై పడి ఉన్న రాజు మృతదేహం

తుని రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 16వ నెంబర్ తుని పట్టణ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి మృతిచెందగా, కుమారుడు తీవ్రగాయాలపాలయ్యాడు. తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ... అనకాపల్లి జిల్లా శరభవరం గ్రామానికి చెందిన వేమునిపూరి రాజు (54), ఆమె కుమారుడు రమణ (35) ద్విచక్ర వాహనంపై తుని మండలం కొత్తూరు తలుపులమ్మ జాతరకి వచ్చి వెళుతుండగా, తుని పట్టణంలోని డీమార్ట్ సమీపంలో బొలేరో వాహనం వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడ్డ రమణని ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలించి, కేసు నమోదు చేశారు.

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా 216 జాతీయ రహదారి వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో నలుగురు గాయపడిన విషయం తెలిసిందే. అందులో ఒక యువకుడు చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. మోటారు సైకిల్‌పై వస్తున్న అయినవిల్లి మండలం శంకరాయగూడానికి చెందిన ఉందుర్తి బాలబాలాజీ (22), కాకినాడ రూరల్ మండలం గొల్లపాలేనికి చెందిన ఖండవల్లి రాజు, అయినవిల్లి మండలం శంకరాయగూడేనికి చెందిన నిడిమోలు ఉమామహేశ్వరరావు, ఐ.పోలవరం మండలం టి.కొత్తపలి పండువారిపేటకు చెందిన బొమ్మివినోద్ ఆదివారం కాకినాడలోని ఓ శుభ కార్యక్రమానికి వెళ్లి ఒకే మోటారు సైకిల్‌పై వీరంతా వస్తుండగా అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొనడంతో నలుగురూ గాయపడ్డారు. దీంతో వీరిని అమలాపురం కిమ్స్‌ఆసుపత్రికి తరలించగా, అందులో ఉందుర్తి బాలబాలాజీ(బాలు) ఆదివారం రాత్రి మృతిచెందాడు. మిగతా ముగ్గురు కిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్టు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.


పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లి శివారు చాకలిపాలెం సమీపంలో సోమవారం తువ్వమట్టి లారీ ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలు మండలం తాటిపాక కాలనీకి చెందిన ముద్దుల గోపాలం (78) సైకిల్‌పై చాకలిపాలెం సెంటర్‌కు వచ్చి పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో వాడ్రేవుపల్లి జంక్షన్ సమీపంలో వెదీపాలెం ర్యాంపు నుంచి హైవే పనుల నిమిత్తం తువ్వమట్టి లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో గోపాలం అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. కాగా పి.గన్నవరం మండలంలో మూడు ర్యాంపులు నడుస్తున్నాయని, అక్కడ నుంచి వచ్చే లారీల వేగాన్ని నియంత్రించాలని పోలీసులను స్థానికులు కోరుతున్నారు. ఇష్టానుసారంగా నడుపుతున్నారన్నారు.

అన్నవరంలో భారీ వర్షం



అన్నవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా వేసవితాపంతో అల్లాడిపోయిన అన్నవరం ప్రజలు సోమవారం కురిసిన భారీ వర్షంతో సేదతీరారు. సాయంత్రం సుమారు రెండుగంటల పాటు కురవడంతో కొండపై నుంచి మెట్లమార్గం, ఘాట్‌రోడ్డులో వర్షపు నీరు జలపాతంలా ప్రవహించింది.

కలకలం రేపిన క్షుద్రపూజలు



తొండంగి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తొండంగి ఊర చెరువులో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిర్వహించిన క్షుద్ర పూజలు కలకలం రేపాయి. కాలనీ రహదారిపై ముగ్గు వేసి మధ్యలో పుర్రె, బొమ్మతోపాటు నిమ్మకాయలు ఉంచి దాని కింద మరో విచిత్రమైన ముగ్గను వేసి పూజలు నిర్వహించారు. ఎంపీడీవో ఆఫీసు వెనుక రహదారిలో తెల్లవారు జామున పూజలు నిర్వహించినప్పటికీ స్థానికులు ఎవరూ గమనించలేదు. ఉదయం చూసేటప్పటికి పుర్రె, మనిషి ఆకారపు బొమ్మ ఉండడం, అక్కడ ముగ్గులు నిమ్మకాయలు, తదితర వస్తువులు ఉండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గతం లో ఎప్పుడూ ఈ విధంగా జరగలేదని వారు చెబుతున్నారు. తెల్లవారు జామున కుక్కల అరుపులు వినిపించాయని, గాఢనిద్రలో ఉండడం వల్ల లేవలేకపోయామని మరికొందరు అంటున్నారు. ఎవరిని ఉద్దేశించి ఇలా చేశారో తెలీక కాలనీ వాసులు వాపోతున్నారు. దీని వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి తగిన విధంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఏలేశ్వరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం పట్టణంలోని క్వారీ ఏరియాలో ఇరువర్గాల మధ్య సోమవారం ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పలువురికి గాయాలయ్యా యి. ఈ మేరకు ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదుపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్టు ఏలేశ్వరం పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఈనెల 14వ తేదీన క్వారీపేటలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారి మధ్య వివాదం చోటుచేసుకుంది. దాన్ని దృష్టిలో పెట్టుకుని సోమవారం ఘర్షణకు దిగారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

తుని రైల్వేస్టేషన్‌లో తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తునిరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు సోమవారం తుని రైల్వే స్టేషన్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. జీఆర్‌పీ ఎస్ఐ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ సిబ్బంది ఎంఎస్‌డీ ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒకటో నెంబరు ప్లాట్‌ఫారంపై అనుమానిత వ్యక్తి వేలిముద్రలతోపట్టుబడ్డాడు. సంబంధిత వ్యక్తిని ఆరా తీయగా, పేరు షేక్ రహీమ్‌గా తెలుసుకున్నారు. ఇతడిపై పలు పోలీస్‌స్టేషన్లో కేసులు ఉన్నట్టు గుర్తించారు. ఆయన్ని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు.

మందుబాబులకు జైలు, జరిమానా

కాకినాడ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 20 మందికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి సోమవారం తీర్పు చెపారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 సీఐలు ఎస్.రమేష్, డి.రామారావు తమ సిబ్బందితో ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో ఓ మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించారు. వారిని సోమవారం కోర్టులో హాజరు పరచగా... ఆరుగురికి రెండురోజుల చొప్పున జైలు శిక్ష, మరో 14 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్టు సీఐ రమేష్ చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన యువతి ఈనెల 27వ తేదీన కాలేజీకి వెళ్లింది. మరలా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కల ఎంత వెతికినా కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 9440796622, 9154875583 నెంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి

ఆర్టీసీ సంస్థ పురోభివృద్ధిలో ఉద్యోగులు కీలకం

ఆదర్శ ఉద్యోగుల అభినందన సత్కారసభలో రాజమహేంద్రవరం డీఎం షబ్నం



డిపో మేనేజర్ నుంచి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందుకున్న ఆర్టీసీ సిబ్బంది

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ పురోభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం అని రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం అన్నారు. సోమవారం ఏపీఎస్ ఆర్టీసీ స్థానిక డిపో ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సత్కార సభ జరిగింది. కార్యక్రమంలో డిపోలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన ముగ్గుర డ్రైవర్లు, అత్యధిక ఈపీకే తెచ్చిన నలుగురు కండక్టర్లకు, ఇద్దరు డ్రైవర్లకు, ప్రతిభ కనబరచిన గ్యారేజీ సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.నాగలక్ష్మి, బస్‌స్టేషన్ మేనేజర్ ఏవీరావు, ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఈడీ మూల్యాంకన కేంద్రం పరిశీలన

దివాన్‌చెరువు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అనుభవం జోడించి తగిన విధంగా మూల్యాంకనం చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అధ్యాపకులకు సూచించారు. నన్నయ వర్శిటీలో బీఈడీ మూల్యాంకన కేంద్రాన్ని సోమవారం సందర్శించి మూల్యాంకనాన్ని పర్యవేక్షించారు. దాదాపు 72 మంది అధ్యాపకులతో 10,600 పత్రాలు మూల్యాంకనం బీవోఎస్ ఛైర్మన్ కె.సుబ్బారావు ఆధ్వర్యంలో జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.సుధాకర్, బీఈడీ విద్యా కళాశాల సహాయాచార్యులు, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వంట సామగ్రి వితరణ

గోకవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతలో భాగంగా అస్సాగో పరిశ్రమ యాజమాన్యం అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం అస్సాగో పరిశ్రమ నిర్వాహకులు కుర్చీలు, కుక్కర్లు, వంట సామగ్రి తదితర వస్తువులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వివేక్‌కుమార్ శుక్లా, జనరల్ మేనేజర్ ఐ.చంద్రశేఖర్, ఏఎస్‌వో భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భద్రతలో సాంకేతిక నిఘా వ్యవస్థ కీలకం

ఎల్అండ్‌టీ సంస్థ రక్షణ వ్యవస్థ సలహాదారు జీఎస్ఎన్ రాజు

రాజానగరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రతలో సాంకేతిక నిఘా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని రక్షణ వ్యవస్థ సలహాదారు జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లో ఈసీఈ విభాగంలో ఆధ్వర్యంలో సాంకేతిక మేధస్సుపై సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నేటి డిజిటల్ యుగంలో సాంకేతిక నిఘా వ్యవస్థలు జాతీయ భద్రతకు ముడిపడి ఉన్నాయని, ముప్పులను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవడంలో కీలకంగా నిలుస్తాయన్నారు. మన దేశం ఇటీవల సాంకేతిక సామర్థ్యాలను గణనీయంగా అభివృద్ధి చేసిందని, డ్రోన్లు, మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్, ఆధునిక సైనిక పరిజ్ఞానం వంటి రంగాల్లో మైలురాళ్లను అధిగమించిందన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, ఆర్ఎస్ఎన్ రాజు, టీవీ ప్రసాద్, డీన్ బి.ప్రభాకరరావు, ఈసీఈ విభాగాధిపతి పి.వెంకటరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాలకు

దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఔత్సాహికులైన మైనారిటీలకు వివిధ బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మైనారిటీ(ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శికులు)లు వివిధ బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు కోసం అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వయస్సు 21 నుంచి 55 సంవత్సరాలులోపు ఉండి, రైస్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూ తేదీని, సమయాన్ని తర్వాత తెలియజేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

మహిళలకు ఉచితంగా పట్టుచీరల అందజేత



పట్టుచీరలు అందుకున్న మహిళలతో కంబాల శ్రీనివాసరావు

రాజానగరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నరేంద్రపురంలోని శ్రీముత్యాలమ్మ జాతర మహోత్సవంలో భాగంగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు మహిళలకు ఉచితంగా పట్టుచీరలను అందజేశారు. పట్టు చీరల పంపిణీలో భాగంగా నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గెలుపొందిన 300 మంది మహిళలకు ఉచితంగా పట్టుచీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఆళ్ల శివ నాగరాజు, రామసేన సభ్యులు దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, నాగా రమేష్, వీరాంజలి, పచ్చారి నరసింహమూర్తి, బత్తిన వీరాంజనేయులు, రాంబాబు, చింతల దేవి కన్నారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

రాజానగరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో తూర్పుగోనగూడెంలోని ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని బాధితులకు భరోసా కల్పించారు. బాధితులు శన్నంశెట్టి రామస్వామి, ముత్యాలరావు కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ.10 వేలు వంతున ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో చాగల్నాడు కాలువ ఛైర్మన్, జనసేన నాయకుడు అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, గళ్లా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: మండలంలోని పశ్చిమగోనగూడెంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన మూడు కుటుంబాలకు విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు నగదు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గోనగూడెం సర్పంచ్ రొంగల దేవిక, కటకం చలం తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక వెలమపేటలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన కోడూరి సన్యాసిరావుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో స్టీల్ డిన్నర్ సెట్‌ను తహశీల్దార్ ఎ శ్రీనివాసరావు అందించారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ సత్యం రమేష్‌బాబు మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ సుధాకర్, సురేష్‌బాబు, పి.శివ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ రేటుకే భూములు కేటాయించడం దారుణం

మాజీ ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు తక్కువ రేటుకే భూములు కట్టబెడుతూ ప్రజల సొమ్మును అన్యాయంగా, అక్రమంగా కొంతమంది వ్యక్తులకు దోచిపెడుతోందని మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. విశాఖపట్నంలో ఉర్సా కంపెనీకి భూములు కేటాయించిన విషయంపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సోమవారం రాజమహేంద్రవరంలోని వైసీపీ సిటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక పక్క టీసీఎస్‌ను అడ్డుపెట్టుకుని, మరోపక్క ఉర్సా పేరిట భారీగా ప్రభుత్వ భూములు కాజేసే కార్యక్రమం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం వ్యవహారంలో భారీ కుంభకోణం జరుగుతోందని, ప్రధానంగా డ్రెడ్జింగ్ చేస్తూ గోదావరి నదికి గర్భశోకాన్ని కల్గిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు గతంలో ఇసుకపై యుద్ధం చేస్తే ఆయన కుమారుడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఇసుక మాఫియాకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా, సెంట్రల్ జైలుకు పంపించినా అధికార పార్టీ నేతల అక్రమాలను ప్రశ్నించకుండా ఉండనని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జంబూపట్నంలో అన్నసమారాధన

కోరుకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలం జంబూపట్నం గ్రామదేవత గొడుగులమ్మ అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారి అన్న సమారాధనకు రూ.40 వేలు ఆర్థిక ఆయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలకు లక్కీడిప్ నిర్వహించి 200 మందికి ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగా రమేష్, నాగా వీరాంజలి, పచ్చారి నరసింహమూర్తి, బత్తిన వీరాంజనేయులు, పసల గణేష్, కర్రి బడ్డి, పలకం శెట్టి శ్రీను, కర్రి పురుషోత్తం పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు

సూర్య నమస్కారాల పార్కు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి



సూర్య నమస్కారాల పార్కు ప్రారంభించిన ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్ సమీపంలో నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.48 లక్షలతో ఏర్పాటు చేసిన సూర్యనమస్కారాల పార్కును సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ప్రజలనుఉ ఆరోగ్యంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

హజ్ సొసైటీ.. మెడికల్ క్యాంప్

స్థానిక నెహ్రూనగర్ బిలాల్ షాదీఖానాలో గోదావరి హజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లా హజ్ యాత్రికులకు మెడికల్ వ్యాక్సినేషన్ క్యాంప్ నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే వాసు విచ్చేసి నోట్లో చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హజ్ యాత్ర విజయవంతం అయ్యేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందన్నారు. రాష్ట్రం నుంచి 1630 మంది హజ్ యాత్రకు ఈ ఏడాది వివిధ దశల్లో హైదరాబాద్, బెంగుళూరు ఎంబార్కేషన్ కేంద్రాల నుంచి బయలుదేరుతున్నారని వారందరికీ ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టి వసతులు ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మహ్మద్ అబ్దుల్లా, గోదావరి హజ్ సొసైటీ అధ్యక్షుడు హబీబ్‌బేగ్, సభ్యులు పాల్గొన్నారు.

జూలై 5కి లోక్ అదాలత్ మార్పు

కొవ్వూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 10న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో జూలై 5కి మార్పు చేసినట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని కక్షిదారులు, న్యాయవాదులు, అధికారులు గమనించాలన్నారు.

కోరుకొండ ఎస్ఐగా నాగరాజు

బాధ్యతల స్వీకరణ



కోరుకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా కూన నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు రాజమహేంద్రవరం టూటౌన్ ఎస్ఐగా పని చేసిన ఆయన బదిలీపై కోరుకొండ వచ్చారు. ఇప్పటి వరకు కోరుకొండ ఎస్ఐగా పనిచేసిన టి.శ్యామ్ సుందర్ రాజమహేంద్రవరం టూటౌన్ లా అండ్‌ఆర్డర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళుతున్న శ్యామ్‌సుందర్‌ను స్టేషన్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అలాగే నూతన ఎస్ఐ నాగరాజుకు ఘనంగా స్వాగతం పలికారు.

తాగునీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



ఫీల్డ్ అసిస్టెంట్‌కు నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో మండలంలో ఎటువంటి తాగునీటి సమస్య తలెత్తకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదేశించారు.సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. వేసవి ప్రారంభమైందని, రంగంపేట మండలం మెట్ట ప్రాంతం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడే ప్రమాదముందని, ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులతో మాట్లాడారు. సుబ్రహ్మణ్యంపేటలో ఏర్పాటు చేసిన బోరుకు కరెంట్ లేక మోటారు వేయలేదని చెప్పగా తక్షణమే పంచాయతీ నిధుల నుంచి రూ.1.60 లక్షలు ట్రాన్స్‌ఫార్మర్‌కి డీడీ తీయాలన్నారు. చినదొడ్డిగుంటలో బోరు పోయిందని, సింగంపల్లిలో వాటర్ ట్యాంక్ పిల్లర్స్ శిథిలావస్థకు చేరాయని, వాటికి మరమ్మతులు చేపట్టడం లేదా కొత్తవాటిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. రంగంపేటలో వాటర్ ట్యాంక్‌కు అవుట్‌పుట్ పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం రంగంపేట, వెంకటాపురం, సింగంపల్లి, నల్లమిల్లి గ్రామాలకు చెందిన నలుగురికి ఎంజీఎన్ఆర్‌జీఈఎస్ ఫీల్డ్ అసిస్టెంట్స్ నియామక పత్రాలను ఎమ్మెల్యే అందించారు. ఇదిలా ఉండగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు సోదరుడు టీడీపీ నాయకుడు ఆళ్ల సత్యనారాయణ(బాబి) పుట్టినరోజు సందర్భంగా వడిశలేరులో గోవిందు నివాసం వద్ద ఎమ్మెల్యే నల్లమిల్లి కేక్ కట్‌చేసి బాబికి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమాల్లో ఆళ్ల గోవిందు, ఎంపీడీవో సాయిబాబు, డీఎంపీడీవో వెంకటరత్నం, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బంగారం చోరీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సంజీవయ్యనగర్‌లోని ఓ ఇంట్లోకి దొంగలు పడి బంగారం, సుమారు రూ.2 లక్షల నగదు అపహరించుకుపోయారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. సంజీవయ్యనగర్‌కు చెందిన డి.మణికుమారి అనే ఒంటరి మహిళ ఈనెల 2న తన అమ్మగారి ఊరైన బుట్టాయిగూడెం వెళ్లింది. తిరిగి సోమవారం ఇంటికి చేరుకుని ప్రధాన తలుపు తాళాలు తీసి లోపలికి వెళ్లి చూస్తే వెనుక భాగంలో డోర్ తీసివుంది. బీరువాలో పెట్టిన 4గ్రాముల బంగారు గొలుసు, రూ.1.97 లక్షల నగదు, రాగి, ఇత్తడి పాత్రలు కనిపించలేదు. దీంతో బాధితురాలు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్న వ్యక్తి

ఆర్ఎస్ఐపై దాడి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల వెనుక ప్రాంతం గణేష్‌నగర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ఏఆర్ ఎస్ఐ అప్పలరాజుపై గుర్తుతెలియని వాహనదారుడు దాడి చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. గణేష్‌నగర్‌లో విధి నిర్వహణలో ఉన్న ఏఆర్ ఎస్ఐ అప్పలరాజు మద్యం మత్తులో బైక్ నడుపుతున్న వ్యక్తిని నిలుపుదల చేసే ప్రయత్నం చేయగా ఆ గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసి పరారయ్యాడు. ఈ మేరకు ఎస్ఐ ఫిర్యాదుతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం శాటిలైట్‌లో నివాసం ఉంటున్న ఆకుల శ్రీనివాసనాయుడు(23) తన ఇంట్లో ఉరిపోసుకుని మృతి చెందినట్టు బొమ్మూరు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ తల్లి దుబాయ్‌లో ఉంటుండగా ఇక్కడ శ్రీనివాస్ ఒక్కరే ఉంటున్నాడు. అయితే అతడు ఆరోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. స్థానికులు సమాచారంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు బొమ్మూరు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తల్లికి సమాచారం ఇచ్చినట్టు పేర్కొన్నారు.

రామవరం పంచాయతీ

వార్డు మెంబరు రాజీనామా

అనపర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి మండలం రామవరం పంచాయతీ 14వ వార్డు మెంబరు తాడేలు వెంకన్న (వైసీపీ) సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డికి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆయన లేఖలో పేర్కొన్నారు.

దారిని పునరుద్ధరించండి

‣ రంగంపేట తహశీల్దార్‌కు ఏపీ రైతు కూలీ సంఘం వినతి
‣ పలుచోట్ల పీజీఆర్ఎస్



రంగంపేటలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రాజబాబు

రంగంపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం ఈలకొలను గ్రామ పంచాయతీ పరిధి అచ్యుతాపురం శివారు కొత్తపేట ప్రజలు రాకపోకలు సాగిస్తున్న దారి మార్గాన్ని గ్రామంలో ప్రైవేటు వ్యక్తులు మూసివేశారని, దానిని పునరుద్ధరించాలని, సమగ్ర సర్వే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ కోసు అనసూయకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేటకు దళితులు, ఇతర పేదలకు సంబంధించిన దారి విషయంలో అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు. పూర్వం నుంచి రాకపోకలు సాగిస్తున్న దారి మూసివేయడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి దళితుల దారి పునరుద్ధరించాలని, లేకుంటే ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, ఏపీఆర్‌సీఎస్ నాయకులు తానింకి అంకుశం,పత్తి వెంకన్న, నూకతట్టు గన్నెమ్మ, కుసుపూడి దుర్గ, పీతా సత్యవతి, పూరూరి పద్మ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు 29 అర్జీలు..

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వరరావు ప్రజల నుంచి 29 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన ఎన్.సుభద్ర తనకు వృద్ధాప్య పింఛను ఇప్పించాలని, సీహెచ్ సురేఖ.. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నానని, తనకు ప్రభుత్వ గృహం కాని ఇంటి స్థలం ఇప్పించాలని కోరారు. భాస్కర్ నగర్‌కు చెందిన వీఎంపీ లింగస్వార్ స్థానిక ఆర్ఎస్ 116/ప్లాట్ 17కు రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు అనుమతించాలని కోరారు. జీవి తాను నివాసం ఉంటున్న వార్డులో పార్కు అధ్వానంగా ఉందని, దానిని అభివృద్ధి చేయాలని అర్జీలను అడిషనల్ కమిషనర్‌కు అందించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ కోటయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

పలుచోట్ల వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు



సీతానగరంలో వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభిస్తున్న దృశ్యం

రంగంపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నిగూఢమైన సృజనాత్మకశక్తి, నైపుణ్యాలను వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల ద్వారా వెలికితీయవచ్చని రంగంపేట ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు సరస్వతిదేవీ, గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్,అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం వేసవి విజ్ఞాన తరగతుల గోడ పత్రికను ఆవిష్కరించారు. తదుపరి బాలల పుస్తకాలతో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉండవిల్లి మాణిక్యం, మండవిల్లి గుప్త, పోతుల వీరసుందర్రావు, పోతుల చిన్నికాపు, గుండుబిల్లి ప్రసాద్, ఉండవిల్లి గంగాధరం, కంటిపూడి దేవి, గారపాటి అబ్బులు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరంలోని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించినట్టు గ్రంథాలయాధికారి కలగర సత్యనారాయణ తెలిపారు. స్థానిక జనసేన నాయకుడు సైతిన చెల్లారావు ఈ తరగతులను ప్రారంభించారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ టి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభమయ్యాయి. విశ్రాంత సహాయ సంక్షేమాధికారి సురేష్‌బాబు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ డాక్టర్ సత్యం రమేష్‌బాబు, విశ్రాంత ఉపాధ్యాయుడు బి.భాస్కరరావు, రఘుదేవపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రమాదేవి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతులు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేయడం చక్కటి అవకాశమని, విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం మా తెలుగుతల్లికి మల్లెపూదండ అనే గేయాన్ని విద్యార్థులు ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.శేఖర్, ఎస్.రామకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీల సమస్యలు పరిష్కరించాలి

ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి విల్సన్‌పాల్

కడియం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎంఎల్‌హెచ్‌పీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి విల్సన్‌పాల్ కోరారు. తమ సమస్యల పరిష్కారానికి మద్దతు కోరుతూ మండలానికి చెందిన ఎంఎల్ హెచ్‌పీ నాయకత్వ బృందం జి.రాము, సీహెచ్ మణిదీప్తి, సీహెచ్ సుప్రియ, షారోన్ రోజీ తదితరులు తమకు వినతిపత్రం అందజేసినట్టు ఏపీజీఈఏ నాయకులు విల్సన్‌పాల్, మురళీకృష్ణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమంగా అందించాలని, నిర్దిష్టమైన ఉద్యోగ బాధ్యతలు అప్పగించాలని, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాలు లేని చోట నిర్వహిస్తున్న అద్దె భవనాల బకాయిలు చెల్లించాలని సంబంధిత అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు.

ఎన్ఎంయూ కార్మికుల నిరవధిక దీక్షలు

గోకవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తమ డిమాండులను నెరవేర్చాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ కార్మికులు 11 మంది సోమవారం గోకవరం ఆర్టీసీ డిపో ఆవర ణలో నిరవధిక దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు భద్రత కల్పించే వన్ బై 19 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని, మహిళా కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండు చేశారు.

పేపరుమిల్లు పరంపర కార్మికుల సమస్యల పరిష్కారం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆంధ్రాపేపరు మిల్లు పరంపర 1, 2 కార్మికుల సమస్య కొద్దినెలలుగా అపరిష్కృతంగా ఉండడంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించారు. దీంతో 90 రోజులుగా చేపట్టిన సమ్మెను 111 మంది కార్మికులు విరమించారు. గత ప్రభుత్వంలో పరంపర కార్మికులకు అన్యాయం జరిగితే తాను తన కుమారుడు ఆదిరెడ్డి వాసు కలిసి కలెక్టర్, ఎస్పీ, మిల్లు యాజమాన్యంతో, అధికారులతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేశామని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో ఆ పార్టీకి చెందిన కార్మిక నాయకుడు ప్రవీణ్‌చౌదరి, మిల్లు అధికారి జయకృష్ణ, మార్గాని భరత్‌రామ్‌లు పరంపర కార్మికులకు ఉద్యోగాలు వేయిస్తామని సుమారు రూ.6.65 కోట్లు దండుకుని పంపకాలు చేసుకున్నారని చెప్పారు. కాని యువ కార్మికులకు పర్మినెంట్ కార్మికులతో సమానంగా జీతాలు ఇప్పించలేకపోయారని ఆదిరెడ్డి విమర్శించారు.

వాలీబాల్ ఫెడరేషన్ ఛైర్‌పర్సన్‌కు ఘన సత్కారం


రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్‌పర్సన్ రామావతర్ జక్కర్‌ను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. అన్నవరం సత్యదేవుడిని దర్శించుకుని సోమవారం రాజమహేంద్రవరం వచ్చిన జక్కర్‌ను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కుంచే యశ్వంత్, అధ్యక్షుడు రవిరాజు, కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. జక్కర్ 1991 సౌత్ ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్‌మెడల్, 1993లో సిల్వర్ మెడల్ సాధించారని, ఆయన మాజీ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడని తెలిపారు. ఈ సందర్భంగా జక్కర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి అనేక మంది అంతర్జాతీయ క్రీడాకారులు కోచ్‌లుగా ఉన్నారన్నారు. జిల్లా అసోసియేషన్ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మంచిమంచి క్రీడాకారులను గుర్తించి వారిని రాష్ట్ర స్థాయికి పంపించి వాలీబాల్ క్రీడాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

చిరస్మరణీయురాలు డొక్కా సీతమ్మ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నిత్య అన్నదానానికి ప్రతీకగా నిలిచిన డొక్కా సీతమ్మ ఆంధ్రుల అన్నపూర్ణగా నిత్యస్మరణీయులని రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు పాతంశెట్టి శ్రీనివాసరెడ్డి, స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అన్నారు. లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సోమవారం డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి వారు నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో నేటికీ అనేక చోట్ల నిత్యాన్నదానాలు జరగడానికి సీతమ్మే స్ఫూర్తి అని అన్నారు. ఆమె స్ఫూర్తితోనే 27 ఏళ్లుగా స్వర్ణాంధ్ర నిత్యాన్నదానం చేస్తోందన్నారు. కార్యక్రమంలో పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు నయనాల కృష్ణారావు, పెయింటింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకుడు జి.చిట్టిబాబు, స్వర్ణాంధ్ర సిబ్బంది మీరా కుమారి, దివ్య, శేఖర్,హరిప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్ వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పోలవరం కెనాల్ ఫీడర్ బ్రేకర్ నిర్మాణం నిమిత్తం విద్యుత్ సరఫరాను మంగళవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పురుషోత్తపట్నం, రామచంద్రపురం, దేవీపట్నం మండలం నేటకోట గ్రామాలకు, అలాగే తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0 (సోమవారం)
కనిష్ఠం : 25.0

నిద్ర సుఖమెరుగదు.. పాపం పెద్దావిడకు ట్రాఫిక్ బూత్ నీడనిచ్చింది.. ఇలా సేదతీరుతోంది.





పుష్కరఘాట్ వద్ద వంతెన కింద ఎండ మండుతున్న ఇలా..

గూడు లేదు.. నీడా లేదు!

గూడూ నీడా లేని బతుకులు వారివి.. ఎండకు ఎండాలి.. వానకు తడవాలి.. ఎండ మండిపోతున్నా ఎక్కడ నీడ కనిపిస్తే అక్కడ సేద తీరాలి.. పూర్వం ఇటువంటి వారు తలదాచుకోవడానికి సత్రాలు ఉండేవి.. ఆ సత్రాల నీడన ఉండే వారు.. స్పీడ్ యుగంలో అటువంటివన్నీ కనుమరుగైపోయాయి.. అందుకే రోజుల తరబడి పుష్కరఘాట్, గోదావరి గట్టు రోడ్డు పక్కనే వంతెనల కింద తలదాచు కుంటున్నారు.. అయ్యా అధికారులు ఒకసారిపై వీరిపై దృష్టి పెట్టండి..నగరంలో కాస్త నీడచూపండి. - ఫొటోగ్రాఫర్,రాజమహేంద్రవరం





విజయోత్సాహం: తుని మునిసిపల్ కౌన్సిల్ సభ్యులతో ఎమ్మెల్యే యనమల దివ్య.. చైర్‌పర్సన్ నార్ల భువన సుందరిని చైర్మన్ పీఠంపై కూర్చోబెడుతున్న ఎమ్మెల్యే

మద్దతుని.. కూడగట్టుకుని..

తుని చైర్మన్ పీఠం టీడీపీ కైవసం

- ప్రశాంతంగా మునిసిపల్ ఎన్నిక
- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల ఏకగ్రీవం
- చైర్‌పర్సన్‌గా భువన సుందరి
- వైస్ చైర్మన్‌గా ఆచంట సురేష్
- పట్టణంలో సెక్షన్ 144 అమలు

తునిరూరల్,ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ మద్దతుని సంపాదించింది. చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. కాకినాడ జిల్లా తుని మునిసిపాలిటీలో చైర్‌పర్సన్ పీఠంతో పాటు వైస్ చైర్మన్‌ను టీడీపీ దక్కించుకుంది. టీడీపీ మద్దతు ప్రకటించిన చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, వైస్‌చైర్మన్ ఆచంట సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తుని మునిసిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిల్ ఉండగా, వీరంతా వైసీపీ నుంచే గెలిచారు. వీరిలో ఒకరు మృతి చెందగా, మరొకరు రాజీనామా చేశారు. దీంతో 28 మంది కౌన్సిల్ సభ్యులు ఉండగా 15మంది కౌన్సిలర్లు టీడీపీలోకి చేరడంతో వైసీపీ బలం సన్నగిల్లింది.ఈ నేపథ్యంలో ఎన్నిక లాంఛనమైంది. ఎన్నికల పరిశీలకులు, కాకినాడ జేసీ రాహుల్‌మీనా, ఎన్నికల అధికారి, డీపీవో రవి కుమార్ సోమవారం ఉదయం 11 గంటలకు మునిసిపల్ కౌన్సిల్ హాల్లో ఎన్నిక నిర్వహించారు. 26వ వార్డు కౌన్సిలర్ల కొచ్చెర్లపాటి రూపాదేవి 18వ వార్డు కౌన్సిలర్ నార్ల భువన సుందరిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా 24వ వార్డు కౌన్సిలర్ పులి సత్యనారాయణ మద్దతు తెలిపారు. దీంతో మునిసిపల్ చైర్‌పర్సన్‌గా నార్ల భువనసుందరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. వైస్‌చైర్మన్‌గా 19వ వార్డు కౌన్సిలర్ ఆచంట సురేష్‌ను 28వ వార్డు కౌన్సిలర్ చింతకాయల భారతి ప్రతిపాదించగా 9వ వార్డు కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీనివాస్ మద్దతు తెలపగా, వైస్‌చైర్మన్‌గా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మునిసిపల్ ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య హాజరై చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను అభినందించారు. తర్వాత ఎన్నికల అధికారి రవికుమార్ నియామకపత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ముహూర్త సమయానికి ఎమ్మెల్యే దివ్య చైర్‌పర్సన్ భువన సుందరిని మునిసిపల్ పీఠంపై కూర్చోబెట్టి అభినందించారు. ఎన్నికల నేపథ్యంలో మునిసిపల్ కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలుచేశారు. అలాగే డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐలు గీతారామకృష్ణ, చెన్నకేశవరావు ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించారు.



వైస్‌చైర్మన్ ఆచంట సురేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే దివ్య

తుని నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం. పట్టణాభివృద్ధికి కంకణబద్ధులై తనతో అడుగులు వేసేందుకు 15 మంది కౌన్సిలర్లు స్వచ్ఛందంగా టీడీపీలో చేరారు. వారందరి సహకారంతో పట్టణాన్ని స్మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తా..

పదవి బాధ్యతగా భావించి పనిచేస్తా..



తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా అవకాశం ఇచ్చినందుకు ఆనందంగా ఉంది. ఈ పదవిని బాధ్యతగా భావించి పట్టణాభివృద్ధికి కృషి చేస్తా. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య సూచనలతో ముందుకు వెళతా. పట్టణంలో శానిటేషన్ మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటా.
- నార్ల భువన సుందరి, చైర్‌పర్సన్

నాడు సహకారం.. నేడు ధిక్కారం!



డీసీసీబీ చైర్మన్ ఎంపికపై తెగని పంచాయితీ

- డీసీసీబీ చైర్మన్ ఎవరో..
- రసవత్తరంగా మారిన ఎంపిక
- తాజాగా పది జిల్లాలకు ప్రకటన
- ఉమ్మడి జిల్లా చైర్మన్ వాయిదా
- నీరుగారిన ఆశావహులు
- టీడీపీ,జనసేన మధ్య వార్
- తొలుత టీడీపీకే నిర్ణయం
- పశ్చిమ జనసేనకు
- మారిన పరిణామాలు
- పదవుల పంపకం వాయిదా
- ఎంపికపై అయోమయం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డీసీసీబీ చైర్మన్ ఎంపిక రసకందాయంలో పడింది. రేపో మాపో టీడీపీ నుంచి నామినేటెడ్ చైర్మన్ పేరు ప్రకటించడానికి అంతా సిద్ధమైందనుకున్న తరుణంలో చివర్లో జిల్లా పేరే జాబితాలో మాయమైపోయింది. రాష్ట్రంలో పది ఉమ్మడి జిల్లాల్లో నామినేటెడ్ డీసీసీబీ చైర్మన్లను సోమవారం ప్రకటించిన ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ పేరును పక్కన పెట్టేసింది. దీంతో ఈ పదవి ఎవరిని వరిస్తుందనేది ఉత్కంఠగా మారింది. అదే సమయంలో పక్కనే ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ పేరును కూడా వాయిదా వేయడంతో మరింత సస్పెన్స్ నెలకొనేలా చేసింది. ఈ రెండు ఉమ్మడి జిల్లాల్లో చైర్మన్ కుర్చీ టీడీపీ, జనసేనలో ఎవరు ఏది పంచుకోవాలనేదానిపై ఇరుపార్టీల మధ్య ఏర్పడ్డ సందిగ్ధతే దీని కారణం. వాస్తవానికి ఉమ్మడి పశ్చిమ చైర్మన్ కుర్చీ జనసేన, ఉమ్మడి తూర్పు కుర్చీ టీడీపీ తీసుకోవాలని గతంలో నిర్ణయించాయి. చివర్లో పశ్చిమ చైర్మన్ కుర్చీ కచ్చితంగా తమకు ఇవ్వాల్సిందేనని టీడీపీ పట్టుబట్టింది. ఇరుపార్టీల మధ్య నెలకొన్న కుర్చీల పంపకం గందరగోళంతో ఉభయగోదావరి జిల్లాల్లో ఎంపికను సీఎం వాయిదావేశారు. ఈక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్ కుర్చీలో

అంతా సిద్ధమే.. ఈలోగా..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ పాలకవర్గం రద్దయింది. అప్పటివరకు వైసీపీ ప్రభుత్వంలో కొనసాగిన డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజుతో సహా మొత్తం బోర్డు రాజీనామా చేయడంతో గతేడాది జూన్ నుంచి డీసీసీబీ చైర్మన్ కుర్చీ ఖాళీ అయింది. అయితే ఇప్పట్లో డీసీసీబీకి ఎన్నికలు నిర్వహించే వీలులేక తాత్కాలికంగా చైర్మన్ పోస్టును నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక నామినేటెడ్ పోస్టులు ఖాళీగా ఉండడంతో సీఎం చంద్రబాబు గత కొన్ని నెలలుగా కసరత్తు చేసి టీడీపీ, జనసేన నేతలతో భర్తీ చేశారు. ఉమ్మడి జిల్లాలో రాష్ట్రస్థాయి పౌర సరఫరాల సంస్థ చైర్మన్, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్మన్ వంటి పలు కీలక పోస్టులను జనసేనకు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న డీసీసీబీ చైర్మన్ కుర్చీని మాత్రం టీడీపీకి కేటాయించాలని ఎమ్మెల్యేలు, పార్టీ ఆశావహుల నుంచి టీడీపీ అధినేతపై ఒత్తిళ్లు పెరిగాయి. ఉమ్మడి జిల్లాలో అనేక కీలక నామినేటెడ్ పోస్టులు జనసేనకు కట్టబెట్టడంతో డీసీసీబీ టీడీపీకి, డీసీఎంఎస్ జనసేనకు ఇవ్వాలని ప్రతిపాదించారు. అదే సమయంలో డీసీసీబీ చైర్మన్ జనసేనకు, డీసీఎంఎస్ టీడీపీకి ఇవ్వాలని జనసేన నుంచి ఒత్తిడి అధికమైంది. దీంతో ఇరుపార్టీల కీలక నేతల మధ్య కొన్ని నెలల కిందట జరిగిన చర్చల్లో ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీ చైర్మన్ టీడీపీకి, ఉమ్మడి పశ్చిమ డీసీసీబీ చైర్మన్ జనసేన పంచుకునేలా సూత్రప్రాయంగా ఒప్పందం కుదిరింది. ఉమ్మడి తూర్పు చైర్మన్ కుర్చీ టీడీపీకి ఖాయం అనే సంకేతాలు అందడంతో అనేక మంది టీడీపీ నేతలు తీవ్రంగా ప్రయత్నించారు. తమ గాడ్‌ఫాదర్‌లను, అనుకూల ఎమ్మెల్యేలను కలిసి తమ పేరు ప్రతిపాదించేలా పావులు కదిపారు. ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖలు సేకరించారు.



కూర్చునేది ఎవరినేది ఆసక్తికరంగా మారింది.

ఆశావహులకు నిరాశ..

గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన జ్యోతుల నవీన్ తనకు ఎన్నికల్లో కాకినాడ ఎంపీ టికెట్ ఎలాగూ రానందున డీసీసీబీ చైర్మన్ కుర్చీ కావాలని అధిష్ఠానం వద్ద ప్రతిపాదించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఉమ్మడి జిల్లాలో పది మంది ఎమ్మెల్యేల నుంచి తన పేరును ప్రతిపాదిస్తూ సిఫార్సు లేఖలు తీసుకున్నారు. పలువురు మంత్రుల ద్వారా రాయబారం నడిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీటు చేజారినందున చైర్మన్ కుర్చీ అయినా ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. కోనసీమ జిల్లాకు చెందిన టీడీపీ సీనియర్ నేత మెట్ల రమణబాబు, కిర్లంపూడికి చెందిన మాజీ జడ్పీటీసీ తోట నవీన్, కాకినాడ రూరల్ టీడీపీ సీనియర్ నేత పిల్లి సత్తిబాబు సైతం పదవి ఆశించారు. తమకు చైర్మన్ పదవి వరించడం ఖాయమని ఎవరికివారే లెక్కలేసుకున్న తరుణంలో అనూహ్యంగా సోమవారం ప్రకటించిన చైర్మన్ల జాబితాలో ఉమ్మడి జిల్లా పేరు లేకపోవడంతో ఆశావహులంతా కంగుతిన్నారు.

ఏ కుర్చీ ఎవరికో..

జనసేనకు ఇవ్వాలనుకున్న పశ్చిమగోదావరి డీసీసీబీ చైర్మన్ కుర్చీ తమకే కావాలంటూ కొన్ని రోజులుగా అక్కడ టీడీపీ నేతలు పార్టీపై ఒత్తిడి తెస్తున్నారు. తాజా ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్ దక్కనివారి నుంచి పదవులు రాని నేతలంతా తమకు చైర్మన్ పదవి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. జనసేనకు బదులు కుర్చీ టీడీపీకే ఇవ్వాలని చంద్రబాబు, లోకేశ్‌పై ఒత్తిడి తెచ్చారు. పైగా 2014లో ఉంగుటూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గన్ని వీరాంజనేయులు 2019లో ఓడిపోయారు. ప్రస్తుతం ఏలూరు పార్లమెంట్ టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే ఈయనకు పదవి ఇస్తామని పార్టీ ఇది వరకే హామీ ఇచ్చింది. ఆ తర్వాత ఆప్కాబ్ చైర్మన్ పదవి ఇస్తానని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆప్కాబ్ కాకపోయినా డీసీసీబీ కుర్చీ ఇవ్వాల్సిన పరిస్థితి. మరికొందరు సీనియర్లు సైతం తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఈనేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ చైర్మన్ టీడీపీ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదే జరిగితే ఉమ్మడి తూర్పు కుర్చీని టీడీపీ వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో మళ్లీ టీడీపీ, జనసేన గతంలో నిర్ణయించుకున్న జిల్లాల కుర్చీలు మార్చుకోవాల్సి వస్తోంది. ఈ తలనొప్పులు ప్రస్తుతం తేల్చే పరిస్థితి లేక ఈ రెండు ఉమ్మడి జిల్లాల డీసీసీబీ కుర్చీల చైర్మన్లను సీఎం ప్రకటించకుండా వాయిదా వేశారు. ఉమ్మడి తూర్పు కుర్చీ జనసేనకు విడిచిపెడితే ఇక్కడ టీడీపీ సీనియర్లు, ఆశావహులు మరింత గుర్రుగా మారనున్నారు. ఇప్పటికే కీలక పదవులు జనసేనకు వెళ్లడంతో ఇది కూడా వదిలేసుకుంటే ఎలా అనే నిట్టూర్పులు వ్యక్తం కానున్నాయి. పోనీ జనసేన ఇప్పటివరకు దీనిపై ఆశలు పెట్టుకోకపోవడంతో అసలు అభ్యర్థే లేని పరిస్థితి. ఇదిలా ఉంటే తాజాగా ప్రకటించిన డీసీసీబీ చైర్మన్ పదవులు ఆరు నెలలు మాత్రమే ఉంటాయి. ఈలోపు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ కుదరకపోతే మరో ఆరునెలల చొప్పున చైర్మన్ పోస్టును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించుకుంటూ వెళ్లవచ్చు.

మే 3న నిడదవోలులో మెగా జాబ్‌మేళా

నిడదవోలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యో తి) : యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి మే 3వ తేదీన ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిడదవోలులో నిర్వహించే మెగా జాబ్ మేళాలో 45 కంపెనీలు 1302 మందికి ఉద్యో గాలు కల్పించే అవకాశం ఉందన్నారు. అర్హతను బట్టి రూ.12 వేల నుంచి రూ.40 వేల వరకు జీతం ఇస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్, పీజీ పాసైన 35 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ యువకులు మే 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే మెగా జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు.

126 మంది దివ్యాంగులకు కలెక్టర్ అభినందన

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లల అసమాన ప్రతిభ ఎందరికో స్ఫూర్తిని నింపిందని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. జిల్లావ్యాప్తంగా పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రత్యేక అవసరాలు గల పిల్లలు 126 మందిని సోమవారం కలెక్టర్ తన చాంబర్‌లో కలిపి ప్రత్యేకంగా అభినందించారు.ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు 88.86 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.మొదటి స్థానంలో నిలిచిన రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్‌సిటీకి చెందిన చిరంజీవి శివశంకర్,రాజమహేంద్రవరానికి చెందిన నవ్యశ్రీ, తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన ఆకుల లావణ్యలక్ష్మి తదితరులను అభినందించారు.

మాకు.. సెలవుల్లేవా.. తాతయ్యా!



అంగన్‌వాడీలకు వేసవి సెలవుల్లేవ్

- నేటికీ కొనసాగింపు
- పెరుగుతున్న ఎండలు
- 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు
- చిన్నారుల ఆపసోపాలు
- అయినా పట్టని ప్రభుత్వం
- నేటికీ విడుదల కాని ప్రకటన
- తగ్గుతున్న హాజరుశాతం
- సెలవులకు డిమాండ్

దివాన్‌చెరువు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అన్ని స్కూళ్లకు వేసవి సెలవులు ఇచ్చేశారు.. ఒక్క అంగన్‌వాడీలకు తప్ప.. దీంతో మాకెప్పుడిస్తారు తాతయ్యా సెలవులు అంటూ చిన్నారులు మారం చేస్తున్నారు. పెద్ద పిల్లలకేనా ఎండలు మాకు కాదా అంటూ బోరు బోరుమంటున్నారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా రాష్ట్రంలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు ప్రభుత్వం ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించింది. కానీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందించే అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తున్నాయి. దీంతో ఈ కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఎండతీవ్రత తట్టుకోలేక ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్వ ప్రాథమిక విద్య కోసం 3 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులు వస్తారు. రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టుపరిధిలోని రాజానగరం, రాజమహేంద్రవరం ,కడియం మండలాల్లో దాదాపు 300 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తుండగా రాజానగరం మండలంలో సుమారు 100 అంగన్‌వాడీ కేంద్రాలు 591 మంది బాలింతలు, 530 మంది గర్భిణులతో పాటు మూడు నుంచి ఐదేళ్లలోపు వయసు గల దాదాపు 2270 మంది పిల్లలకు సేవలందిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు ఉదయం హుషారుగా వస్తున్న చిన్నారులు మధ్యాహ్నానికి వాడిపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 15వ తేదీ నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు ఒంటిపూట పనిచేస్తున్నాయి.ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కేంద్రం పనివేళలుగా ప్రభుత్వం నిర్ణయించి నిర్వహిస్తోంది. కేంద్రం పనివేళలకు ముందుగానే కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకువెళ్తుండగా , మరి కొంతమంది అసలు తమ పిల్లలను కేంద్రాలకు పంపడంలేదని తెలిసింది. సాధారణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల అన్నలు, అక్కలు ప్రభుత్వ పాఠశాలల్లోనో, ప్రైవేట్ పాఠశాలల్లోనో చదువుతూ ఉంటారు. ఆయా పాఠశాలలకు వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఈ నెల 24 నుంచి సెలవులు ప్రకటించారు. దాదాపు 50 రోజుల తర్వాత జూన్ 13 నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం అవుతాయి. సాధారణంగా ఈ సెలవు రోజుల్లో పిల్లలు వారిబంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వకపోవడంతో చిన్నారులంతా ఇంటి వద్దే ఉండి ప్రతి రోజూ కేంద్రాలకు వస్తున్నారు. ముందు వేసవి తీవ్రత పెరిగే అవకాశం ఉంది. దానిని తట్టుకోలేని చిన్నారులెవరైనా అస్వస్థతకు గురవుతారేమోనన్న ఆందోళన కొంతమంది వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారాన్ని వేసవిసెలవులు సమయంలో టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్)గా అందజేయవచ్చునని సూచిస్తున్నారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే వర్కర్లు, సహాయకులకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరుతున్నారు.ప్రతి ఏటా మే నెలలో వర్కర్లు, సహాయకులకు చెరో 15 రోజులు వంతున వేసవి సెలవులు ప్రభుత్వం ఇస్తోంది. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేం ద్రాలకు సెలవులు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.



పీజీఆర్‌ఎస్‌లో ప్రజల సమస్యలు వింటున్న అధికారులు

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దు

పీజీఆర్‌ఎస్‌లో అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో జేసీ ఎస్.చిన్నరాముడుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వహించవద్దన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన ఆడిట్‌ను ప్రతి శాఖ తప్పక చేయించాలన్నారు.కిందస్థాయి ఉద్యోగులు చూపిన పరిష్కారంపై ఫిర్యాదుదారులు సంతృప్తి చెందక పైస్థాయి అధికారి లాగిన్‌కి పంపితే జిల్లా స్థాయి అధికారులే స్వయంగా పరిష్కరించాలన్నారు.కిందిస్థాయి ఉద్యోగులకు తిప్పి పంపవద్దన్నారు. తమ లాగిన్‌కు వచ్చిన ఫిర్యాదుపై తప్పక విచారణ చేసి సాక్ష్యాలు దగ్గర ఉంచుకోవాలని స్పష్టం చేశారు. విచారణ తేదీ సమయాన్ని సూచిస్తూ ఫిర్యాదుదారుడుకి నోటీసు పంపాలన్నారు.పీజీఆర్‌ఎస్‌లో సోమవారం 189 అర్జీలు స్వీకరించారు.తాళ్లపూడి అన్నదేవరపేటలో పంచాయతీ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని కొండె అనిల్ కుమార్, రాజమహేంద్రవరానికి చెందిన పి.లీలాకృష్ణ రాజమండ్రి నగరపాలక సంస్థలో ఉద్యోగం నిమిత్తం, ధవళేశ్వరానికి చెందిన పిల్లి ఉమా ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నారు. పలువురు సమస్యలపై విన్నవించారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వైద్య ఉద్యోగులు

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

డివిజనల్ పీజీఆర్ఎస్‌కు ఏడు ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత

కొవ్వూరు, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు టోల్‌ఫ్రీ నెంబర్ 1100కు ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చునని ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత తెలిపారు.సోమవారం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఏడు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీవో సుస్మిత మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వ్యయప్రయాసలకు గురై ఆర్డీవో కార్యాలయానికి రానవసరం లేదని, ప్రతి సోమవారం తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, సచివాలయాలు లేదా టోల్ ఫ్రీనెంబర్ 1100కు ఫోన్ చేసి అర్జీలు అందించవచ్చునన్నారు. డివిజనల్, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ రిలే నిరాహార దీక్షలు



దీక్షలో నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు

నిడదవోలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సిబ్బంది సమస్యలపై రాష్ట్ర కార్యవర్గం యాజమాన్యానికి నోటీసు ఇచ్చినా... స్పందన లేని కారణంగా దశలవారీ ఆందోళనలో భాగంగా రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టామని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి ఆర్‌వీ రావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో బయట ఎన్ఎంయూ సభ్యులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమ, మంగళవారాలు దీక్షలు జరుగుతాయని, అప్పటికీ యాజమాన్యం నుంచి స్పందన లేకపోతే రాష్ట్ర కార్యవర్గం ఇచ్చే ఏ పిలుపుకైనా కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. దీక్షలో దాసరి రంగారావు, కె.రమేష్, కారింకి వెంకటేష్, ఆర్‌వీ రావు, గ్యారేజ్ కార్యదర్శి ధనరాజ్, డిపో సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగ మురళీకృష్ణ

కొవ్వూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో కోర్టులకు వచ్చే కక్షిదారుల సౌకర్యార్థం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని సీనియర్ న్యాయవాది నూతి వెంకట సుబ్బారావు అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ పిలుపుమేరకు కొవ్వూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బార్ అధ్యక్షుడు వర్రే నాగ మురళీకృష్ణ రిబ్బన్ కట్ చేయగా, సీనియర్ న్యాయవాది మజ్జిగ పంపిణీ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పీవీపీ లక్ష్మి, ముంగమూరి నాగమణి, ఏపీపీ కె. వెంకటరమణ, దొండపాటి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

సర్క్యులర్ 1/2019ని తక్షణమే అమలుచేయాలి

● ఎన్ఎంయూ డిమాండ్



కొవ్వూరు ఆర్టీసి డిపో ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019ని తక్షణం అమలుచేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు డీఎంఆర్ రాజు డిమాండ్ చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కొవ్వూరు ఆర్టీసీ డిపో ఎదుట సోమవారం 18 అంశాలపై రిలే దీక్షలను చేపట్టారు. సీసీఎస్ డెలిగేట్ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. జి. జ్యోతి, టీబీ దేవి, ఎం. శ్రీనివాసరావు, పీ.ఎస్. ప్రకాశరావు, జి. గాంధీ, వి.ఆర్. శేఖర్, వి.కె.ఎమ్. స్వామి, ఎంఎస్. వాసు, కె.ఎస్ఎల్వీ కుమార్ మొదటిరోజు దీక్షలో కూర్చున్నారు. డిపో సెక్రటరీ ఎం. శివకుమార్ మాట్లాడుతూ అక్రమ సస్పెషన్లు, అక్రమ రిమూవల్స్‌ను వెంటనే నిలుపుదల చేయాలి. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి. తుని నుంచి కాకినాడ వరకు రిలీవింగ్‌కు వెళ్లిన డ్రైవర్లను వెనక్కి పంపాలి. ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలి. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విదానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీజనల్ కార్యదర్శి ఎస్.డి ముఖర్జి, రీజనల్ అధ్యక్షుడు సీహెచ్ఎస్ రాజు, బి. శ్రీనివాసరావు, వై. బాబూరావు, కేవీ రమణ, కె. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పెరవలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మల్లేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ నారాయణ అప్పారావు తెలిపారు. దీంతో మల్లేశ్వరం, పిట్టలవేమవరం, కడింపాడుకు సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి ఉదయం 4 నుంచి 6 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు.

మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించాలి



రోగులకు మలేరియా కిట్స్ అందజేస్తున్న ఎంపీపీ యల్లారీశ్వరి, డాక్టర్ ప్రసాద్

ఉండ్రాజవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీ వద్ద మలేరియా వ్యాధిగ్రస్తులకు మలేరియా కిట్స్‌ను ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ బోధ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులకు వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. బోదకాలు వుండుపడకుండా ఎలా క్లీన్ చేసుకోవాలో సిబ్బంది వారికి క్లీన్ చేసి చూపించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం. సుబ్రహ్మణ్యం, ఆరోగ్యకార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్ వినయ్‌కు అభినందనలు



వినయ్‌ను అభినందిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టుదలతో చదివితే విజయం తప్పక వరిస్తుందని కొవ్వూరు ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత అన్నారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాలలో 274వ ర్యాంకు సాధించిన కొవ్వూరుకు చెందిన దొమ్మేటి వినయ్‌ని సోమవారం ఆర్డీవో పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అలాగే మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని శాలువాను కప్పి సత్కరించారు. వినయ్‌ని అభినందించిన వారిలో మున్సిపల్ మేనేజర్ పి. సాయిబాబు, టౌన్ ప్లానింగ్ అధికారి టి. మణిరామ్, ఏఈ సందీప్, శ్రీనివాస్, వి. శివరామకృష్ణ, సూరపనేని సురేష్, తదితరులు ఉన్నారు.

గోపాలపురం ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన గోపాలపురం ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

గోపాలపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గోపాలపురం యూనిట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా సభ్యులను ఉద్యోగులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గంజి శాంతి, కార్యదర్శిగా డీ.పతంజలి, సహాయ కార్యదర్శిగా దుర్గాప్రసాద్, కోశాధికారిగా అనిల్‌కుమార్, జిల్లా కౌన్సిలర్-1 జీ.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ 2గా కేజీ సుధీర్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులను పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ పగడాల మృతిపై హైకోర్టుకు ..

కొవ్వూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రవీణ్ పగడాల మృతిపై హైకోర్టుకు వెళ్తున్నట్టు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ తెలిపారు. ఈ విషయమై పార్టీ అధ్యక్షుడు జీఎస్.ఆర్.కె.ఆర్ విజయ్‌కుమార్ ఇప్పటికే స్పష్టం చేశారన్నారు. పోలీసు అధికారుల నివేదికలో తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రవీణ్ పగడాల మద్యం సేవించి ప్రమాదానికి గురయ్యాడని పేర్కొనడం బాధాకరమన్నారు. ఇది ప్రవీణ్‌పగడాల కుటుంబ సమస్య కాదని, యావత్ క్రైస్తవుల సమస్య అన్నారు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

బంగారు కుటుంబం పథకానికి అర్హుల పునఃపరిశీలన



అర్హత కలిగిన కుటుంబాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

తాళ్లపూడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పి4 సర్వే పైలెట్ ప్రాజెక్టు తాడిపూడిలోని 48 కుటుంబాలను మరోసారి పునఃపరిశీలిన చేసి ఆయాకుటుంబాల వారు పి4 బంగారు కుటుంబం పథకానికి అర్హత కలిగి ఉన్నారా లేదా అనే విషయంపై మండలస్థాయి అధికారులు ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ వీరన్న ఆధ్వర్యంలో ప్రతి కుటుంబాన్ని సోమవారం పరిశీలించారు. అర్హత కలిగిన కుటుంబాల డేటాను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో తాడిపూడి కార్యదర్శి భీమేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ విజయ్, ఈశ్వర్, మహిళా పోలీస్ బంగారు పాప, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరుల శాంతి ర్యాలీ



తాళ్లపూడిలో శాంతి ర్యాలీ చేస్తున్న ముస్లిం సోదరులు

తాళ్లపూడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పహెల్‌గాంలో జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తూ తాళ్లపూడిలో ముస్లిం సోదరులు స్థానిక మసీదు సెంటరు నుంచి బస్టాండు సెంటరు వరకు సోమవారం నిరసన వ్యక్తం చేస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాద దాడిలో అమరులైన వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇస్లాం మత గ్రంథమైన ఖురాన్‌లో శాంతి, మానవత, సోదరభావాన్ని బోధించడమే కానీ ఉగ్రవాదాన్ని ఎక్కడా ప్రోత్సహించదని రాష్ట్ర నేర్ బాషా బీసీ సాధికార సమితి కన్వీనర్ షేక్ సుభాన్, రషీ తెలిపారు. కార్యక్రమంలో సర్దార్, షరీఫ్, ఆరీఫ్, బాషా, ఖుదాన్, ఇస్మాయిల్, రజాక్, ఉమర్, సబీర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రికి అభినందనలు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండల టీడీపీ అధ్యక్షుడిగా నాల్గోసారి ఎంపికైన సింహాద్రి రామకృష్ణను సోమవారం పలువురు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు కలసి అభినందనలు తెలిపారు. ఉండ్రాజవరం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మాచినేని మధు, గౌరవ అధ్యక్షుడు కేదారి ఆధ్వర్యంలో కార్మికనాయకులు పులుసు సుబ్రహ్మణ్యం, యిర్రి సుబ్బారావు, ఆళ్ల వెంకన్న కలిశారు. అలాగే చివటం, ఉండ్రాజవరం క్లస్టర్ ఇన్‌చార్జులు ముళ్లపూడి పాండురంగ, వెలిచేటి ప్రసాద్, టీడీపీ నేత రిషిదర్ అభినందించారు.

తక్కువ రేటుకే భూములు కేటాయించడం దారుణం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు తక్కువ రేటుకే భూములు కట్టబెడుతూ ప్రజల సొమ్మును అన్యాయంగా, అక్రమంగా కొంతమంది వ్యక్తులకు దోచిపెడుతోందని మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. విశాఖపట్నంలో ఉర్సా కంపెనీకి భూములు కేటాయించిన విషయంపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సోమవారం రాజమహేంద్రవరంలోని వైసీపీ పార్టీ సిటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక పక్క టీసీఎస్‌ను అడ్డుపెట్టుకుని, మరోపక్క ఉర్సా పేరిట భారీగా ప్రభుత్వ భూములు కాజేసే కార్యక్రమం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం వ్యవహారంలో భారీ కుంభకోణం జరుగుతున్నదని, ప్రధానంగా డ్రెడ్జింగ్ మెషిన్లు పెట్టి గోదావరి నదికి గర్భశోకాన్ని కల్గిస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు గతంలో ఇసుకపై యుద్ధం చేస్తే ఆయన కుమారుడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇసుక మాఫియాకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా, సెంట్రల్ జైలుకు పంపించినా అధికారపార్టీ నేతల అక్రమాలను ప్రశ్నించకుండా ఉండనని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జూలై 5వ తేదీకి జాతీయ లోక్ అదాలత్ మార్పు



9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ

కొవ్వూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల పదో తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో జూలై 5వ తేదీకి మార్పు చేసినట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం మాట్లాడుతూ ఈవిషయాన్ని కక్షిదారులు, న్యాయవాదులు, అధికారులు గమనించాలన్నారు.

మోటార్ సైక్లిస్టుకి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సురేశ్

దేవరపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టుకి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన యర్నగూడెం గండి చెరువు వద్ద సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఇంజే సురేశ్ తన మోటార్‌సైకిల్‌పై ఇంటికి వస్తుండగా అదుపు తప్పి రహదారి పక్కన ఫెన్సింగ్ పోల్‌ను ఢీకొట్టాడు.ఈఘటనలో చేతికి తీవ్రగాయాల వడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు.

యువతి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ... పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన యువతి ఈనెల 27వ తేదీన కాలేజీకి వెళ్లింది. మరలా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఎంత వెతికినా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు పిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 9440796622, 9154875583 నెంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



గ్రంథాలయంలో యోగాసానాలు వేస్తున్న విద్యార్థులు

కొవ్వూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ అన్నారు. సోమవారం ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవివిజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. మీకు ఇష్టమైన కథలు చెప్పడం, సంగీతం, డ్రాయింగ్ వంటి వాటిని నేర్చుకోవాలన్నారు. ఎంఈవో 2 రామకిషోర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా వారిలోని ప్రతిభతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పొందవచ్చునన్నారు. విద్యార్థులచే యోగాసానాలు వేయించారు. గోవర్ధనం శ్రీనివాసమూర్తి, రాధాలక్ష్మి, వల్లీ శాస్త్రి, ఎస్. గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఎంఈవో సీహెచ్ ఆంజనేయులు, తదితరులు

తాళ్లపూడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన తరగతులను ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ఎంఈవో సీహెచ్ ఆం జనేయులు, రీడర్ ప్రకాష్ విచ్చేశారు. రిటైర్డ్ ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులందరూ శిక్షణ తరగతులను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథపాలకులు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: చంద్రవరం శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. గ్రంథపాలకుడు కే. సుమన్ కుమార్ మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని ప్రతిరోజు చదువుకోవడానికి, ఇక్కడ నిర్వహించే సృజనాత్మక పోటీలలో పాల్గొనాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జరిగే కార్యక్ర మాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రిసోర్సుపర్సన్‌గా కాసాని వెంకటేశ్వరరావు వ్యవహరిస్తారని అన్నారు.

దేవరపల్లి: వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాల యాధికారి అనిత పేర్కొన్నారు. యర్నగూడెం శాఖ గ్రంథాల యంలో సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. గ్రంథాలయాధికారి అనిత మాట్లాడుతూ విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాయడం, చదవటం, మాట్లాడటం, డ్రాయింగ్, చెస్, వ్యక్తిత్వ వికాసం వంటి పలు నైపుణ్యాలపై శిక్షణను నిపుణులైన బోధకులచే 40 రోజుల పాటు అందిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొల్లిన విజయభాస్కర్, పెనుమత్స సుబ్బరాజు, వై.కిషోర్, వెంకటసరిత, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



చంద్రవరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి అనిత

1 నుంచి ఉచిత వాలీబాల్ సమ్మర్ క్యాంపు

కొవ్వూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మే 1వ తేదీ నుంచి 31 వరకు ఉచిత వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు గౌతమి స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలోని అల్లూరి వెంకటేశ్వరరావు వాలీబాల్ గ్రౌండ్స్‌లో అవంతి ఫౌండేషన్ సహకారంతో సమ్మర్ కోచింగ్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాబోయే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి బాలబాలికల జట్లను తయారుచేసే సంకల్పంతో దీన్ని నిర్వహిస్తున్నామన్నారు. దూరప్రాంత క్రీడాకారులకు ఉచిత వసతి, బోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4-30 నుంచి 6-30 గంటల వరకు జాతీయ స్థాయి కోచ్‌లతో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. మే 1వ తేదీ ఉదయం 6 గంటలకు క్రీడాకారుల ఎంపిక జరుగుతందన్నారు. 10 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులు పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌తో శిబిరానికి హాజరుకావాలన్నారు. జిల్లా క్రీడా ప్రాదికార సంస్థ పర్యవేక్షణలో శిబిరం నిర్వహించబడుతుందన్నారు. శిక్షణ శిబిరంలో 75 శాతం హాజరు పొందినవారికి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అందించిన సర్టిఫికెట్స్, జత క్రీడా దుస్తులు అందజేయడం జరుగుతుందని క్యాంపు ఇన్‌చార్జి కొయ్యల ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సూరపనేని చిన్ని, ఉప్పులూరి రాజేష్, పాలడుగుల రఘురామ్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గారపాటి రాఘవేంద్రరావు, పి. రాజేష్, ఎస్. హమీరుద్దీన్ పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలని వినతి



నాగేంద్రకు వినతిపత్రం అందిస్తున్న పట్టణ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్

నిడదవోలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెంలో వేంచేసిన కోటసత్తెమ్మ వారి దేవస్థానంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోర్త ప్రమోద్ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నిధుల ద్వారా ఏర్పాటుచేయాలన్నారు. దీనిలో భాగంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్రకు వినతిపత్రం సమర్పించారు.

రెండోసారి టీడీపీ మండల అధ్యక్షుడిగా రామకృష్ణమ్మ ఎన్నిక



పెరవలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా ఖండవల్లికి చెందిన అతికాల రామకృష్ణమ్మ (శ్రీను) రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కానూరు వాకలపూడి వీర్రాజు ఇంటి వద్ద సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో టీడీపీ మం డల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ కమిటీ, బూత్ ఇన్‌చార్జిలను నియమించారు. మండల సెక్రటరీగా పెద్దిరాజును ఎన్నుకున్నారు.కార్యక్రమంలో వాకలపూడి వీర్రాజు, హనుమంతు సుబ్రహ్మణ్యం, ముళ్ళపూడి రాజు, శేషగిరిరావు, శ్రీరాములు, కంటిపూడి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్న ఆర్ఎస్ఐపై దాడి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల వెనుక ప్రాంతం గణేష్‌నగర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ఏఆర్ ఎస్ఐ అప్పలరాజుపై గుర్తుతెలియని వాహనదారుడు దాడి చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. గణేష్‌నగర్‌లో విధి నిర్వహణలో ఉన్న ఏఆర్ ఎస్ఐ అప్పలరాజు మద్యం మత్తులో బైక్ నడుపుతున్న వ్యక్తినినిలుపుదల చేసే ప్రయత్నం చేయగా ఆ గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసి పరారయ్యాడు. ఈ మేరకు ఎస్ఐ ఫిర్యాదుతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు

బంగారం, రూ. రెండు లక్షల నగదు చోరీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సంజీవయ్యనగర్‌లోని ఓ ఇంట్లోకి దొంగలు పడి బంగారం, సుమారు రూ. రెండు లక్షల నగదు అపహరించుకుపోయారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. సంజీవయ్యనగర్‌కు చెందిన డి.మణికుమారి అనే ఒంటరి మహిళ ఈనెల 2న తన అమ్మగారి ఊరైన బుట్టాయిగూడెం వెళ్లింది. తిరిగి సోమవారం ఇంటికి చేరుకుని ప్రధాన తలుపు తాళాలు తీసి లోపలికి వెళ్లి చూస్తే వెనుక భాగంలో తీసివుంది. బీరువాలో పెట్టిన 4 గ్రాముల బంగారు గొలుసు, రూ.1.97 లక్షల నగదు, రాగి, ఇత్తడి పాత్రలు కనిపించలేదు. దీంతో బాధితురాలు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.